ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -71 పేజీలు - 05 వెల - 04/- గురువారం19 మార్చి 2026



# అదనంగా మరో పదిశాతం ఎల్‌పిజి

## తాజాగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

**న్యూఢిల్లీ,,మార్చి18,(ఆంధ్ర ప్రగతి**



ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం కారణంగా దేశంలో తలెత్తిన ఎల్‌పీజీ కొరతను అధిగమించేందుకు కేంద్రం మరో కీలక ప్రకటన చేసింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు అదనంగా మరో 10 శాతం కమర్షియల్ ఎల్‌పీజీ అందించేందుకు అంగీకరించింది. అయితే ఎల్‌పీజీ భారాన్ని తగ్గించి పైప్డ్ నేచురల్ గ్యాస్ వాడకాన్ని పెంచే రాష్ట్రాలకు మాత్రమే ఈ అదనపు సరఫరా వర్తిస్తుందని తెలిపింది. ఆ ప్రకారం ఎల్పీజీ నుంచి పీఎన్‌జీకి మారేలా రాష్ట్రాలు ప్రోత్సహించడం, మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం చేయాల్సి ఉంటుంది. దేశీయ వంటగ్యాస్ సరఫరాకు ఆటకం కలగకుండా చూడటం, వాణిజ్య అవసరాల కోసం గ్యాస్ కొరత తీర్చడం ప్రభుత్వ ముఖ్యోద్దేశమని పెట్రోలియం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ తెలిపారు. సీజీడీ అప్లికేషన్ల అప్రూవల్, సమస్యల పరిష్కారానికి రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేసినట్లయితే 1 శాతం అదనపు కేటాయింపులు జరుపుతామని, డీమ్డ్ సీజీడీ పర్మిషన్లు ఇచ్చేందుకు ఉత్తర్వులు జారీ చేస్తే 2 శాతం, రోడ్ల తవ్వకం, మరమ్మతు పథకం ప్రవేశపెడితే 3 శాతం, వార్షిక రెంటల్/లీజ్ తగ్గిస్తే 4 శాతం అదనపు కేటాయింపులు జరుపుతామని ఆమె చెప్పారు. ఎల్‌పీజీ అంశం ఇంకా ఆందోళనకరంగానే ఉన్నప్పటికే ఆన్‌లైన్ బుకింగ్ పరిస్థితి మెరుగుపడిందని సుజాత శర్మ తెలిపారు. ఈనెల 17న 2,300కు పైగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్టు చెప్పారు. చాలా రాష్ట్రాలు ఇప్పటికే స్టేట్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కాగా, ఎల్పీజీ సరఫరాలపై ఒత్తిడిని తగ్గించేందుకు హాస్పిటాలిటీ, రెస్టారెంట్లతో సహా పలు రంగాలకు కిరోసిన్, బొగ్గు సరఫరాలకు కేంద్రం ఇప్పటికే ఆదేశాలిచ్చింది.

# ఏఎస్‌ఐ అనుమానాస్పద మృతి



**విజయవాడ,,మార్చి18,(ఆంధ్ర ప్రగతి:,** కృష్ణా జిల్లా యనమలకుదురులో ఏఎస్ఐ అనుమానాస్పదంగా మృతి చెందారు. పడమట పోలీస్ స్టేషన్ లో ఏఎస్ఐ గా చేస్తున్న వీరవల్లి గోపి వెంకట దుర్గాప్రసాద్ (54) ఒక కేసు విషయంలో 15 రోజుల క్రితం సస్పెన్షన్ కు గురైన్నారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైనన్నారు. ఈ క్రమంలో యనమలకుదురు కరకట్ట శివారు ఒక పాకలో శవమై తేలారు. ఘటన స్థలానికి చేరుకున్న పెనమలూరు పోలీసులు హత్య లేక ఆత్మహత్య అన్న కోణంలో విచారణ చేస్తున్నారు.

# ఆ యువకుడు చెప్పిన మాటలను

# అంత సులభంగా మర్చిపోలేను

## : పవన్ కల్యాణ్ భావోద్వేగ పోస్ట్

**ఏపీలో 'దివ్యాంగ శక్తి' పథకం ప్రారంభం**

**దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం**

**సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ చేతుల మీదుగా శ్రీకారం**

**బస్సులో ఓ యువకుడితో సంభాషణను పంచుకున్న పవన్ కల్యాణ్**

**రెండింతల ఆర్థిక భారం తగ్గుతుందన్న యువకుడి మాటలు మర్చిపోలేనన్న పవన్**

**విజయవాడ,మార్చి18,(ఆంధ్ర ప్రగతి**




ఏపీ ప్రభుత్వం దివ్యాంగులకు శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో వారికి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ 'దివ్యాంగ శక్తి' అనే పథకాన్ని ప్రారంభించింది. ఇవాళ విజయవాడలో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంగళగిరి బస్ డిపో నుంచి పెనుమాక వరకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించారు. వారి బాగోగులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రయాణంలో తన అనుభవాలను, ముఖ్యంగా ఓ యువకుడితో జరిపిన సంభాషణను డిప్యూటీ సీఎం పవన్ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ఆ యువకుడు చెప్పిన మాటలను అంత సులభంగా మర్చిపోలేనంటూ ఆయన భావోద్వేగభరిత పోస్ట్ పెట్టారు. "దివ్యాంగుల సమస్యలు వినాలనుకునే వ్యక్తిగా పల్లె వెలుగు బస్సు ఎక్కాను. వారి మాటల్లోని నిజాయితీ, శక్తి నన్ను ఆకట్టుకున్నాయి. అయితే, ఓ యువకుడితో జరిపిన సంభాషణ నా మదిలో నిలిచిపోయింది" అని పవన్ పేర్కొన్నారు. స్పెషల్ ఎడ్యుకేటర్‌గా శిక్షణ పొందుతున్న జేఎన్‌టీయూ విద్యార్థి అయిన ఆ యువకుడు, ఆర్థికవేత్త అమర్త్య సేన్ చెప్పిన 'డబుల్ హ్యాండికాప్' అంశాన్ని ప్రస్తావించాడని పవన్ తెలిపారు. సాధారణ వ్యక్తులతో పోలిస్తే, దివ్యాంగులు సాధారణ జీవితం గడిపేందుకు రెండింతల ఆర్థిక భారాన్ని మోయాల్సి ఉంటుందని ఆ యువకుడు వివరించినట్లు పవన్ పేర్కొన్నారు. 'దివ్యాంగ శక్తి' పథకం ఈ ఆర్థిక భారాన్ని తగ్గించడమే కాకుండా, రాష్ట్రానికి, దేశానికి సేవ చేసే అవకాశం కల్పిస్తుందని, అదే ఈ పథకానికి సార్థకత అని ఆ యువకుడు చెప్పిన మాటలు తనను కదిలించాయని పవన్ అన్నారు. నిత్యం సవాళ్లను ఎదుర్కొంటూ కూడా దేశ నిర్మాణం గురించి ఆలోచిస్తున్న ఆ యువకుడి దృక్పథం చాలా గొప్పదని కొనియాడారు. 'దివ్యాంగ శక్తి' కేవలం రవాణా సౌకర్యం కాదని, అది సమాజానికి తిరిగి సేవ చేసేందుకు ఇచ్చిన అవకాశమని పవన్ అభివర్ణించారు. మనం ఇంకా చేయాల్సింది చాలా ఉందని ఈ రోజు తనకు స్పష్టంగా గుర్తు చేసిందంటూ పవన్ కల్యాణ్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

# ఏపీలో రూ.70,232 కోట్లతో రైల్వే ప్రాజెక్టుల పనులు

**త్వరలో విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు**

**సిబ్బంది నియామకం పనులు పూర్తి**

**రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి**



న్యూఢిల్లీ,**మార్చి18,(ఆంధ్ర ప్రగతి:,**త్వరలో విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. విశాఖ రైల్వే జోన్‌పై ఆయన పార్లమెంట్‌లో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. జనరల్ మేనేజర్, ఇతర ఉన్నతాధికారుల నియామకాలు పూర్తయ్యాయని వెల్లడించారు. జోన్ ప్రధాన కార్యాలయ భవనం పునాది పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఎర్రుపాలెం-అమరావతి-నంబూరు లైన్‌కు రూ.2,047 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఏపీలో రూ.70,232 కోట్లతో రైల్వే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయని వివరించారు. జోన్ కార్యకలాపాలు ప్రారంభించేందుకు విఎంఆర్‌డిఎ భవనం 'ది డెక్' సిద్ధమైందని అన్నారు. త్వరలోనే అక్కడి నుంచే పాలన జరుగుతుందని చెప్పుకొచ్చారు. రైల్వేజోన్ కోసం జనరల్ మేనేజర్, ఇతర ఉన్నతాధికారుల నియామకం పూర్తి చేస్తామని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. 2009-2014 మధ్య సగటున రూ. 886 కోట్లు ఉంటే, 2025- 26లో ఆంధ్రప్రదేశ్‌కు రికార్డు స్థాయిలో రూ.9,417 కోట్ల కేటాయింపులు జరిగాయని స్పష్టం చేశారు. గతంతో పోలిస్తే రైల్వేట్రాక్ నిర్మాణ వేగం రెట్టింపు అయిందని వివరించారు. ప్రతి ఏటా సగటున 143 కిలోమీటర్ల మేర కొత్త ట్రాక్ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఎర్రుపాలెం - అమరావతి - నంబూరు కొత్త రైల్వేలైన్ (57 కిలోమీటర్ల) కోసం రూ. 2047 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. ప్రస్తుతం భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఏపీలో ప్రస్తుతం రూ. 70,232 కోట్ల విలువైన 39 రైల్వే ప్రాజెక్టులు (కొత్త లైన్లు, డబ్లింగ్) పనులు కొనసాగుతున్నాయని చెప్పుకొచ్చారు. విజయవాడ - గూడూరు మూడవ రైల్వేలైన్, గుంతకల్ - గుంటూరు డబ్లింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వివరించారు.

# చంద్రబాబునాయుడు 'ఉగాది శుభాకాంక్షలు'

**విజయవాడ,మార్చి18,(ఆంధ్ర ప్రగతి**




ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలుగు ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. రేపు ఉగాది పర్వదినం నేపథ్యంలో రాజకీయ, సినీ ప్రముఖులు తెలుగు ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఈ నూతన సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, అలాగే తాము తలపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు."షడ్రుచుల సమ్మేళనం, పరవశింపచేసే వసంతకాల ఆగమనం, అన్నింటినీ మించిన ఆనందం, భావి జీవితంపై ఆశ రేకెత్తించే శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా తెలుగు ప్రజలందరికి శుభాకాంక్షలు. ఈ నూతన సంవత్సరం మీ అందరి జీవితాల్లో కొత్త వెలుగు తేవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను. మీరు, మీ కుటుంబ సభ్యులు అందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో తులతూగాలని, మీ ఆశలు, ఆకాంక్షలు తీరి, జీవన సాఫల్య ప్రయోజనాలు సిద్ధించాలని కోరుకుంటున్నాను" అని పేర్కొన్నారు. నూతన సంవత్సరంలో పేదరికం లేని సమ సమాజ నిర్మాణం కోసం మనం తలపెట్టిన పీ4 తో పాటు, వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందరూ అందిపుచ్చుకుని పురోగమించాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 'స్వర్ణాంధ్ర విజన్ 2047' విజయవంతంగా ముందుకు సాగాలని అన్నారు.


# కొత్త జీవితం ప్రారంభానికి సూచిక

# పరాభవనామ ఉగాది !




**విజయవాడ,మార్చి18,(ఆంధ్ర ప్రగతి**

కాలం ఒక ప్రవాహం! కాలం దైవ స్వరూపం. నిరంతరంగా సాగుతూనే ఉంది. ఈ ప్రకృతి ఎప్పుడు మొదలయ్యిందో తెలియదు కానీ..మానవుడు తనకు ఊహ తెలిసి, జ్ఞానం సముపార్జించాక సూర్యచంద్రుల గతులను బట్టి..కాల నిర్ణయం చేశాడిన చెబుతారు. పురాణాల ప్రకారం కాలం అనంతం. కాలానికి తగ్గట్టుగా కర్మలు నెరవేర్చడంతోనే మనిషి 'జ్ఞాన ప్రయాణం' మొదలైంది. అదే ఈ యుగానికి.. 'ఆది' అయింది. కాల మహిమను గుర్తు చేసుకుంటూ తెలుగు వారు చేసుకునే మొదటి పండుగే ఉగాది! చైత్రమాసం...వసంత రుతువు కూడా కాలానికి మార్పుగా గుర్తించాలి. ఉగాది నుంచే బ్రహ్మదేవుడు సృష్టి ఆరంభించాడని, యుగాది కాస్తా ఉగాది అయ్యిందన్న ప్రచారం కూడా ఉంది. కాలాన్ని ఆపడం, దానికి ఎదురెళ్లడం ఎవరి తరమూ కాదు. అయితే, మనిషి తన అవసరాలకు అనుకూలంగా కాలాన్ని విభజించుకున్నాడు. అలా కాలాన్ని పరిశీలించుకుంటూ దానికి తగ్గట్లు నడుచుకుంటూ తన బుద్ధికి పదును పెట్టుకున్నాడు. అలా ఉగాది పండుగను తొలి అడుగుగా గుర్తించాడు. చైత్రశుద్ధ పాడ్యమి సూర్యోదయ సమయంలో బ్రహ్మ ఈ జగత్తును సంపూర్ణంగా సృష్టించాడు. అని సమాధానం చెప్పాడు. ఇది ఇలా ఉంచితే మన దేశంలో పుష్య-మాఘ మాసాలు పంటలు పండి ప్రకృతి రసభరితంగా ఉండేకాలం. ప్రజలు తమ శ్రమ ఫలితాన్ని కట్టెదుట చూస్తూ పొంగి పోతారు. ఇదే మొదట్లో మన సంవత్సరాది. దీనిని సూచించే దినం మకర సంక్రమణం. ఇది మార్గశిర-పుష్య-మాఘమాసాల మధ్యన వచ్చేది విషువత్కాలం. విషువత్కాలమంటే పగలూ రాత్రీ సరిసమానంగా ఉండే కాలం. సమరాంత్రిందివే కాలే విషువత్ అన్నాడు అమరసింహుడు. ఈ విషువత్తులు రెండు. మకర సంక్రాంత్రి అలాంటి విషువత్తు లలో ఒకటి. ఈనాటి నుంచి ప్రకృతిలో క్రొత్త క్రొత్త మార్పులు కలగడం ఆరంభం అవుతుంది. మనకొక సంవత్సరమైతే దేవతలకొక దినం. వారి దినం మేషంతో ప్రారంభమౌతోంది; మానవుడు ఋతువులు తన లెక్కలకు ముందు వెనుకలుగా రావడం చూచి, సూర్యచారాన్ని తక్కిన గ్రహాల చారాన్ని లెక్కలు కట్టసాగాడు. సూర్యుడు విషువత్తులో ప్రవేశించిన నాటినుంచి లెక్కకట్టి రాసులు విభజించాడు. ఈవిధంగా నభో మండలం- 12 భాగాలు అయినది. ఆరాసులతోనే మాస సంకేతం చేసుకున్నాడు. సూర్యుడు ఒక రాశినుంచి మరొకరాశికి ప్రవేశించడానికి దాదాపు 30, 31 దినాలవుతుంది. కాని చంద్రుని వృద్ధిక్షయాలతో ఏర్పడిన నెలకు, తర్వాత సూర్యమానపు నెలకూ క్రమంగా నెలవారా రావడం మొదలైంది. చంద్రమానానికి 19 సం.లకు ఏడు అదనపు నెలలు చేర్చి రెండు మానాలను సర్దుకోవలసి వచ్చించి. కనుకనే ప్రతి మూడోఏటా చంద్రమాన సం.లో ఒక అధిక మాసం వస్తూవుంటుంది. నిజానికి చంద్రమానమే వేదకాలం నుంచి ఆచరణలో ఉన్నదేమో!! సౌరమానం వ్యవహారంలో ఉన్న ప్రాంతాలలోనూ వైదిక కర్మలకు చంద్రమానాన్ని అనుసరించడమే దీని ప్రాచీనతకు ప్రమాణం. ఉత్తరాయణం వసంత రుతువు శుక్ల పక్షం ప్యాడ్యమి తిథి.. ఉగాది పండుగ ఈ ఏడాది మార్చి 19న వచ్చింది. అనాదిగా వస్తున్న ఈ ఉగాది.. 'యుగాది'. అన్న సంస్కృత పదం నుంచి పుట్టింది. మన వేదాలకు మంత్ర సృష్టి జరిగిన రోజు. సూర్యుడు మేషరాశిలో ప్రవేశించే రోజు. కాలం వసంతంలోకి అడుగు పెట్టిన రోజునే ఉగాది. పండుగగా, కొత్తసంవత్సరాదిగా తెలుగువాళ్లు జరుపుకుంటున్నారు. వివిధ రాష్ట్రాల్లో వివిధ పేర్లతో ఈ ఉగాది జరుపుకోవడం ఆచారంగా వస్తోంది. మన సంప్రదాయంలో ఏ పండుగను చూసినా అది ప్రకృతితో ముడిపడి ఉంటుంది. అందులోనూ ఉగాది అయితే దాన్ని ఏకోణంలో చూసినా ప్రకృతి ఆధారంగానే కనిపిస్తుంది. వసంత రుతువు వచ్చిందని తెలియజేసే పండుగఉగాది. ఉగాది నాటికి చుట్టు పక్కన ఏ చెట్టును చూసినా లేత ఆకులతో పచ్చగా కనువిందు చేస్తుంటుంది. ఆ సంతోషం కోయిల పాటల్లో, నెమలి నాట్యాల్లో కనిపిస్తుంది. ఉగాది పండుగ వెనక ఉన్న కథనాన్ని ఒక్కొక్కరూ ఒక్కో విధంగా చెప్తారు. ఉగాది.. 'ఉగ' అంటే నక్షత్ర గమనం. జన్మ ఆయుష్షు అని అర్థాలు ఉన్నాయి. వీటికి అది ఉగాది అంటే ఈ ప్రపంచంలో పుట్టిన ప్రతి జీవి ఆయుష్షుడు మొదటిరోజునే ఉగాదిగా మారిందంటారు. చైత్ర శుద్ధ పాడ్యమి నాడే కలియుగం మొదలైందని.. త్రేతాయుగంలో ఉగాది రోజే శ్రీరాముడికి పట్టాభిషేకం జరిగిందని మరో కథనం.. ఈ రోజే శ్రీమహావిష్ణువు మత్స్యావతారంలో సోమకాసురుని సంహరించి వేదాలను బ్రహ్మకు అప్పగించాడని, బ్రహ్మదేవుడు సృష్టిని మొదలు పెట్టిన రోజే ఉగాదని అంటారు. మొదటి తెలుగు చక్రవర్తి శాలివాహనుడు. ఉగాది రోజునే సింహాసనాన్ని అధిష్టించాడనేది కూడా ప్రచారంలో ఉంది. ఉగాది రోజు నుంచే తెలుగు సంవత్సరం మొదలవుతుంది. కాబట్టి ఇది తెలుగువారి మొదటి పండుగగా పేరుగాంచింది. అయితే, తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్టాల్లో్ కూడా ఉగాదిని గొప్పగా జరుపు కుంటారు.. కర్నాటకలో ఉగాదిమహారాష్ట్రలో గుడిపాడ్వా, తమిళనాడులో 'పుత్తాండు అనే పేరుతో, కేరళలో 'విషు', పంజాబ్‌లో 'వైశాఖీ', బెంగాల్లో పొయ్లా బైశాఖ్ ' అనే పేర్లతో ఉగాది జరుపుకుంటారు. రెండు మూడు రోజుల ముందు నుంచే పండగ పనులు మొదలవుతాయి. ఉగాది రోజు పొద్దున్నే ఇంటిని శుభ్రం చేసుకుంటారు. తైల అభ్యంగన స్నానం చేసి గుమ్మానికి మామిడి తోరణాలు, వేపాకు తోరణాలు కడతారు. కొత్త బట్టలు వేసుకొని కొత్త కుండ కొనడంతో సందడి మొదలవుతుంది. ఒకవైపు పచ్చడి తయారు చేస్తుంటే..మరోవైపు వేడివేడిగా భక్ష్యాలు తయారవు తుంటాయి. ఉగాది పచ్చడి...వంటలు ఇష్టమైన దేవునికి నైవేద్యంగా పెట్టి కొత్త సంవత్సరం అంతా శుభం కలగాలని కోరకుంటారు. తర్వాత ఇంటిల్ల పాది పరగడపున ఉగాది పచ్చడి తిని, తర్వాత.. భక్ష్యాలు తింటారు. కొత్త పనులు, కొత్త వ్యాపారాలు కూడా ఉగాది నాడు మొదలు పెడుతుంటారు కొందరు. ఉగాది రోజు పంచాంగ శ్రవణం చేస్తారు. ఈ పంచాంగ శ్రవణం వినడం పట్ల ఈ సంవత్సరంలో జరగబోయే మంచి చెడులతో పాటు పరిణామాలు తెలుసుకుంటారు. కలియుగంలో నక్షత్ర ఫలితాలతో పాటు రాశిఫలాలు.. ఆదాయ వ్యయాలు, రాజపూజ్య అవమానాలు తెలుసుకుంటారు. ఇది జాగ్రత్తగా నడుచుకోవడానికి ఉపయోగపడుతుంది.



ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -71 పేజీలు - 05 వెల - 04/- గురువారం19 మార్చి 2026

పాఠకులకు
ప్రకటనకర్తలు
శ్రేయోభిలాషులకు
ఉగాది
శుభాకాంక్షలు




నేడు ఉగాది పర్వదినం
సందర్భంగా
పత్రికా కార్యాలయానికి సెలవు.
కావున రేపు
(శుక్రవారం 20-3-2026)
సంచిక వెలువడదు ..
(పునర్దర్శనం శనివారం )

# దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం




**ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఇకపై ఉచిత ప్రయాణ సౌకర్యం**

**లబ్ధిదారులతో కలిసి బస్సులో ప్రయాణించిన సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్**

**రూ.6000 పింఛన్, ఉచిత ప్రయాణంపై దివ్యాంగుల హర్షం**

**అనర్హులు లబ్ధి పొందుతున్నారని, వెరిఫికేషన్ చేయాలని సీఎంకు విన**

**అమరావతి, మార్చి18ఆంధ్ర ప్రగతి**

దివ్యాంగుల ఆత్మగౌరవాన్ని పెంచుతూ, వారి సాధికారతకు బాటలు వేసే దిశగా ఏపీ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే 'దివ్యాంగశక్తి' పథకాన్ని సీఎం చంద్రబాబు నాయుడు లాంఛనంగా ప్రారంభించారు. మంగళగిరిలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంగళగిరి బస్టాండ్ నుంచి రాజధాని ప్రాంతంలోని పెనుమాక వరకు సుమారు 11 కిలోమీటర్ల పాటు దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

మిగతా 2లో.



# యుద్ధ బీభత్సం

**ఇరాన్ క్షిపణి స్థావరాలపై అమెరికా బంకర్ విధ్వంసక బాంబులు**



**అమెరికా, ఇజ్రాయిల్ దాడుల్లో ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి మృతి**

**బుషెర్ అణు విద్యుత్ కేంద్రం సమీపంలో వైమానిక దాడి**


**లారిజానీ హత్యకు ప్రతీకారంగా క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడిన టెహ్రాన్**

**ఇరాన్ ప్రభుత్వం బలహీనపడలేదు : అమెరికాకు ఇజ్రాయిల్ రహస్య నివేదిక**

**మార్చి18ఆంధ్ర ప్రగతి**

మధ్యప్రాచ్యంలో యుద్ధ బీభత్సం కొనసాగుతోంది. ఇరాన్ భద్రతా దళాల అధినేత అలీ లారిజానీ, బసిజ్ వాలంటరీ మిలిషియా ఫోర్స్ కమాండర్ జనరల్ సొలైమనీలను హతమార్చిన ఇజ్రాయిల్, అమెరికా సేనలు బుధవారం జరిపిన తాజా దాడులలో ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మాయిల్ ఖతీబ్‌ను చంపాయి. త్వరలోనే మరిన్ని 'అనూహ్య పరిణామాలు' చోటుచేసుకుంటాయని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి కట్జ్ హెచ్చరించారు. ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా ఇరాన్ నేతలను, సైనికాధికారులను మట్టుపెట్టే అధికారాన్ని రక్షణ దళాలకు కట్టబెట్టామని ఆయన తెలిపారు.

మిగతా 2లో.



# రాజకీయాల్లో ఫుల్‌స్టాప్‌లు ఉండవు

**: ప్రధాని మోడీ**



**ప్రజా ప్రాముఖ్య సమస్యలపై చర్చ అవసరం అందుకనుగుణంగా సమావేశాల రోజుల సంఖ్యను పెంచాలి : రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే**

న్యూఢిల్లీ **మార్చి18ఆంధ్ర ప్రగతి**

ప్రజా ప్రాముఖ్యత ఉన్న సమస్యలపై లోతుగా చర్చించేందుకు చర్చలు అవసరమనీ, అందుకు వీలుగా సభా సమావేశాల సంఖ్యను పెంచాలని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే అన్నారు. బుధవారం రాజ్యసభలో పదవీ విరమణ చేస్తున్న 59 మంది ఎంపీలకు వీడ్కోలు పలికే ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. "పేదలు, సమాజంలోని

# ఎగిసిపడిన అగ్నికీలలు..

**ఢిల్లీ, ఇండోర్‌ల్లో 17 మంది మృతి-, ఆరుగురికి గాయాలు**

**అహ్మదాబాద్, చండీగడ్‌ల్లోనూ భారీ అగ్ని ప్రమాదాలు**

**న్యూఢిల్లీ : మార్చి18ఆంధ్ర ప్రగతి**

—ని ఢిల్లీతో పాటు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదాల్లో 17 మంది మృతి చెందారు. మృతుల్లో చిన్నారులు కూడా ఉన్నారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఢిల్లీలోని పాలం ప్రాంతంలో బుధవారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ముగ్గురు చిన్నారులతో సహా ఒకే కుటుంబానికి చెందిన తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. పాలం మెట్రో స్టేషన్ సమీపంలోని

మిగతా 2లో.




# అకాల వర్షాలకు నలుగురు మృతి

**పిడుగుపాటుకు ముగ్గురు, గోడకూలి ఒకరు**

**గుంటూరు, బాపట్ల జిల్లాల్లో పంటలకు అపార నష్టం**

**అమరావతి, మార్చి18ఆంధ్ర ప్రగతి**

రాష్ట్రంలోని పలు జిల్లాలో బుధవారం ఆకస్మికంగా అకాల వర్షాలు కురిశారు. వాతావరణంలో ఒక్కసారిగా మార్పు వచ్చింది. కొన్నిచోట్ల వర్షంతోపాటు పిడుగులు పడడంతో ముగ్గురు మృతి చెందారు. గోడ కూలి ఒక బాలుడు మరణించాడు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో వేలాది ఎకరాల్లో పంటలకు నష్టం వాటిలింది. రాజధాని అమరావతిలోనూ,

మిగతా 2లో.



# ఐదేళ్లలో జగన్ ఎందుకు వివేకా కేసు తవ్వలేదు

**ఎందుకు దోషులను పట్టుకునే ప్రయత్నం చేయలేదు**

**కడప ఎంపి సీటు కోసమే వివేకా హత్యజరిగింది**

**పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల ఘాటు వ్యాఖ్యలు**

**విశాఖపట్నం, మార్చి18ఆంధ్ర ప్రగతి**

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల కీలక వ్యాఖ్యలు చేశారు. ఐదేళ్ల పాలనలో జగన్ ఎందుకు ఈ కేసును తేల్చలేక పోయారని అన్నారు. దీనికి ఎందుకు న్యాయం చేయలేదని నిలదీసారు. బుధవారం విశాఖపట్నంలో షర్మిల పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడారు. కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి.. వివేకా కుమార్తె సునీత మీద చేసిన వ్యాఖ్యలకు తాను చాలా బాధపడ్డానని అన్నారు. వివేకాకు గుండెపోటు వచ్చిందని సునీతనే చెప్పారని..

మిగతా 2లో.



# డ్రగ్స్ కేసులో మా ప్రమేయం లేదు

**2029లోనే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు**

**మొయినాబాద్ డ్రగ్స్ కేసులో సిట్ వేశాం**

**నిబంధనల మేరకే స్టేషన్ బెయిల్ -ఢిల్లీలో సిఎం రేవంత్ రెడ్డి**



**న్యూఢిల్లీ, మార్చి18ఆంధ్ర ప్రగతి**

మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. దీనిలో తమ ప్రమేయం ఏమీ లేదని ఆయన చెప్పారు. దిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో మాట్లాడారు. మొయినాబాద్ డ్రగ్స్ కేసులో నిబంధనల ప్రకారమే స్టేషన్ బెయిల్ ఇచ్చారు. దీనిలో మా ప్రమేయం ఏమీ లేదు.

మిగతా 2లో.



# పోలవరం నిర్వాసితుల త్యాగం మరువలేనిది..

**గత పాలకులు తీరుతో ప్రాజెక్టులో జాప్యం**

**నిర్వాసితులతో సిఎం చంద్రబాబు సమావేశం**

**నిర్వాసితులకు రూ.226 కోట్ల చెక్కు అందచేత**

**అమరావతి, మార్చి18ఆంధ్ర ప్రగతి**

పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణాన్ని అనుకున సమయానికి పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. గత ప్రభుత్వం వల్ల ఆలస్యం జరిగిందని అన్నారు. సకాలంలో పూర్తి చేసి గోదావరి జలాలను అందుబాటులోకి తెస్తామని అన్నారు

మిగతా 2లో.

# యుద్ధ బీభత్సం



**మొదటిపేజీ తరువాయి**

గుడారంలో దాక్కున్న సొలైమనీని వైమానిక దాడిలో హతమార్చామని ఇజ్రాయిల్ సైనిక ఇంటెలిజెన్స్ అధికారి ఒకరు చెప్పారు. మరోవైపు హోర్ముజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ క్షిపణి స్థావరాలపై అమెరికా 2,200 కిలోల బంకర్ విధ్వంసక బాంబులను ప్రయోగించింది. జలసంధిలో ఉన్న నౌకలను ధ్వంసం చేసేందుకు ఇరాన్ క్రూయిజ్ క్షిపణులను మోహరించిందని, వాటిని లక్ష్యంగా చేసుకొని ఈ దాడులు జరిపామని అమెరికా సైన్యం తెలిపింది. హోర్ముజ్ జలసంధిలో ప్రయాణించే చమురు ట్యాంకర్లకు రక్షణగా నౌకలను పంపాల్సిందిగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన అభ్యర్థనను అనేక మిత్ర దేశాలు తోసిపుచ్చిన కొన్ని గంటల వ్యవధిలోనే ఈ దాడి జరగడం గమనార్హం. ఇరాన్ దక్షిణ తీరంలోని బుషెర్ అణు విద్యుత్ కేంద్రం సమీపంలో కూడా దాడి జరిగింది. అయితే ఈ ఘటనలో ఎలాంటి రేడియేషన్ వెలువడలేదని, అలాగే నష్టం కూడా జరగలేదని రష్యా, ఇరాన్ అధికారులను ఉటంకిస్తూ అసోసియేటెడ్ ప్రెస్ తెలియజేసింది. అణు విద్యుత్ ప్లాంటులో ఉన్న మెట్రోలజీ సర్వీస్ భవనం సమీపంలో ఈ దాడి జరిగింది. ఈ దాడిపై తమకు ఇరాన్ సమాచారం ఇచ్చిందని ఐరాసకు చెందిన అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) చెప్పింది. పర్షియన్ గల్ఫ్ వెంబడి టెహ్రాన్‌కు దక్షిణంగా 750 కిలోమీటర్ల దూరంలో ఈ అణు శక్తి కేంద్రం ఉంది. ఇది ఇరాన్ నడుపుతున్న ఏకైక అణు శక్తి ప్లాంట్. రష్యా సాంకేతిక నిపుణుల సాయంతో దీనిని నిర్వహిస్తున్నారు. కాగా ఇరాన్‌లోని దొరుద్ నగరంపై జరిగిన తాజా దాడిలో ఏడుగురు చనిపోగా 56 మంది గాయపడ్డారు.

**చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతోడ**

యుద్ధంలో నేతలు, సైనికాధికారులను కోల్పోతున్నప్పటికీ ఇరాన్ చెక్కుచెదరని ఆత్మ విశ్వాసంతో పోరు సాగిస్తోంది. లారిజానీ హత్యకు ప్రతీకారంగా అనేక గల్ఫ్ దేశాలపై వివిధ రకాల వార్‌హెడ్లతో కూడిన క్షిపణులను, డ్రోన్లను ప్రయోగిస్తోంది. వాటిని అడ్డుకునేందుకు గల్ఫ్ దేశాలు ఆపసోపాలు పడుతున్నాయి. ఇజ్రాయిల్ గగనతల రక్షణ వ్యవస్థల కన్నుగప్పి భారీ నష్టాన్ని కలిగించే ఓ ఆయుధాన్ని ఇరాన్ ప్రయోగించినట్టు సమాచారం. ఇరాన్ ప్రయోగించిన ఖొర్రంషెహర్-4, ఖ్యాద్ క్షిపణుల కారణంగా ఖతార్, కువైట్, యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిలలో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. ఇరాన్ దాడులలో యూఏఈ బాగా దెబ్బతింటోందని, క్షిపణులు, డ్రోన్లు సహా ఇప్పటి వరకూ గల్ఫ్ దేశాలపై మూడు వేలకు పైగా దాడులు జరిగాయని అల్ జజీరా వార్తా సంస్థ ప్రతినిధి బస్రావీ తెలిపారు. వీటిలో సగం దాడులు యూఏఈని లక్ష్యంగా చేసుకొని జరిగినవే. దాడుల కారణంగా దుబాయిలోనే కాక గల్ఫ్ దేశాలలోని అనేక నగరాలలో దట్టంగా పొగలు కమ్ముకున్నాయి. గల్ఫ్‌లో అనేక మంది ప్రాణాలు కోల్పోయారని, ఆయా దేశాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలుస్తోంది. బాగ్దాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయం ప్రాంగణాన్ని ఓ క్షిపణి తాకింది. అయితే ఈ దాడికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. సౌదీ అరేబియాలో అమెరికా దళాలు, యుద్ధ విమానాలకు ఆశ్రయం కల్పిస్తున్న ప్రిన్స్ సుల్తాన్ వైమానిక స్థావరంపై బాలిస్టిక్ క్షిపణి దాడి జరిగింది. యూఏఈలోని ఆస్ట్రేలియా సైనిక స్థావరంపై కూడా దాడి జరిగింది. ఈ ఘటనలో స్వల్పంగా మంటలు చెలరేగాయి.

**కువైట్ రాకుమారుడితో మాట్లాడిన మోడీ**

మధ్యప్రాచ్యంలో నెలకొన్న పరిస్థితులపై ప్రధాని నరేంద్ర మోడీ కువైట్ రాకుమారుడు సబహ్ అల్-ఖలీద్ అల్-హమద్ అల్-ముబారక్ అల్-సహబ్‌తో బుధవారం టెలిఫోన్‌లో సంభాషించారు. ఈ సందర్భంగా ఆయనకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. పశ్చిమాసియాలో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలపై ఆందోళన వ్యక్తం చేశారు. కువైట్ సార్వ భౌమత్వంపై జరుగుతున్న దాడులను ఖండించారు. హోర్ముజ్ జలసంధి మీదుగా చమురు నౌకలు స్వేచ్ఛగా ప్రయాణించేలా చూసేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

# దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం

**మొదటిపేజీ తరువాయి**

ఈ పథకం ద్వారా 40 శాతానికి పైగా వైకల్యం ఉన్న దివ్యాంగులు ఏపీఎస్ఆర్టీసీకి చెందిన పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా ప్రయాణించవచ్చు. దివ్యాంగులతో పాటు వారి సహాయకులకు ప్రయాణ ఛార్జీలో 50 శాతం రాయితీ కల్పించారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 12.76 లక్షల మంది దివ్యాంగులకు ప్రయోజనం చేకూరనుంది. ఇందుకోసం ప్రభుత్వం ఏటా రూ.207 కోట్లను ఆర్టీసీకి చెల్లించనుంది. పథకం ప్రారంభం అనంతరం సీఎం చంద్రబాబు తన నివాసంలో పలువురు దివ్యాంగులకు ఆత్మీయ విందు ఏర్పాటు చేసి, వారితో కలిసి భోజనం చేశారు.

**దివ్యాంగులకు అండగా ఉంటాం: సీఎం చంద్రబాబు**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... "దివ్యాంగులంటే విభిన్న ప్రతిభావంతులు. వారిలో ఆత్మవిశ్వాసం నింపి, సాధికారత సాధించేలా చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం. కేవలం సాయం అందించడమే కాకుండా, వారి ఖర్చులను తగ్గించి గౌరవాన్ని పెంచడంపైనే దృష్టి సారించాం. గతంలో రూ.500గా ఉన్న పింఛన్‌ను మేమే దశలవారీగా పెంచాం. ఇప్పుడు రూ.6,000 ఇస్తున్న ఏకైక ప్రభుత్వం మాదే. తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారికి రూ.10 వేలు, మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు అందిస్తున్నాం. ఇప్పుడు ఉచిత బస్సు ప్రయాణంతో వారికి



నెలకు సుమారు రూ.2,000 వరకు ఆదా అవుతుంది" అని వివరించారు.

2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం వల్లే దివ్యాంగుల పింఛన్ పెరిగిందని, 'దివ్యాంగశక్తి' వంటి పథకాలు అమలవుతున్నాయని చంద్రబాబు గుర్తుచేశారు. "గత ప్రభుత్వం దివ్యాంగులకు ఒక్క రూపాయి కూడా పింఛన్ పెంచలేదు. అంతేకాకుండా, దివ్యాంగుల కోటాలో అర్హత లేని వారు కూడా ఉద్యోగాలు, పింఛన్లు పొందడం బాధాకరం. అలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటాం" అని సీఎం స్పష్టం చేశారు. మహిళల కోసం ప్రవేశపెట్టిన 'స్త్రీశక్తి' పథకం ద్వారా ఇప్పటికే 52 కోట్ల ఉచిత ప్రయాణాలు నమోదయ్యాయని, అదే స్ఫూర్తితో 'దివ్యాంగశక్తి' కూడా విజయవంతమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



**కూటమి ప్రభుత్వం కలకాలం ఉండాలి: దివ్యాంగులు**

ముఖ్యమంత్రి ఇచ్చిన విందులో పాల్గొన్న దివ్యాంగులు తమ ఆనందాన్ని పంచుకున్నారు. రూ.6,000 పింఛన్‌తో పాటు ఇప్పుడు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తమ లాంటి వారికి అండగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వం మరో 15 ఏళ్లు అధికారంలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కొందరు దివ్యాంగులు తమ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దివ్యాంగుల ముసుగులో కొందరు తప్పుడు ధ్రువపత్రాలతో ప్రభుత్వ పథకాలు, ఉద్యోగాలు పొందుతున్నారని, దీనిపై క్షుణ్ణంగా విచారణ జరిపి అనర్హులను ఏరివేయాలని ముఖ్యమంత్రిని కోరారు. వారి విజ్ఞప్తిపై సీఎం సానుకూలంగా స్పందించినట్టు తెలిసింది.

# పోలవరం నిర్వాసితుల త్యాగం మరువలేనిది..

**.మొదటిపేజీ తరువాయి**

ఈ సందర్భంగా ముంపు గ్రామాల నిర్వాసితులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం సమావేశం నిర్వహించారు. పునరావాస పరిహార ప్యాకేజీ మూడో విడతలో భాగంగా నిర్వాసితులకు రూ.226 కోట్ల చెక్కును సీఎం అందించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్ట్ రాష్ట్రానికి జీవనాడి అని, నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు. గత పాలకులు నిర్వాసితులను పట్టించుకోకుండా, వరదల్లో ప్రజలు మునిగిపోతున్నా నిర్లక్ష్యంగా వదిలేశారని సీఎం విమర్శించారు. ప్రాజెక్టు కోసం తమ ఇళ్లు, భూములను త్యాగం చేశారని సీఎం తెలిపారు. ఉగాది పండుగ సందర్భంగా రూ.226.6 కోట్లను నిర్వాసితుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు ప్రకటించారు. గతంలో సంక్రాంతి సందర్భంగా మొదటి విడతగా రూ.800 కోట్లు, దీపావళి సమయంలో రెండో విడతగా రూ.916 కోట్లు చెల్లించినట్లు గుర్తుచేశారు. 21 నెలల్లో 26,149 మంది నిర్వాసితులకు మొత్తం రూ.1,943.53 కోట్లు చెల్లించామని వివరించారు. మూడోసారి గోదావరి పుష్కరాల నిర్వహణకు ముందే ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్ట్ పూర్తికి మరో రూ.5 వేల కోట్లు అవసరమని, ఒక వంతెన కూడా నిర్మిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. నిర్వాసితుల త్యాగానికి ప్రతిఫలం పోలవరం ప్రాజెక్ట్ అని సీఎం పేర్కొన్నారు. నిర్వాసితులకు పారదర్శకంగా చెల్లింపులు జరుపుతున్నామని చెప్పారు. దళారులను నమ్మవద్దని సూచించారు. ప్రాజెక్ట్ ప్రారంభానికంటే ముందే నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. పోలవరం నిర్వాసితుల పట్ల కూటమి ప్రభుత్వానికి కమిట్‌మెంట్ ఉందని.. నిర్వాసిత యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కూడా చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ప్రాజెక్ట్ రెండు దశలుగా నిర్మాణం జరుగుతోందన్నారు సీఎం. తొలి దశలో 38,068 మంది నిర్వాసితులు ఉన్నారని తెలిపారు. ప్రతి నిర్వాసితుడికి ఇంటి నిర్మాణానికి రూ.3.5 లక్షలు ఇస్తున్నామని, ఇంటి జాగా కోసం రూ.2 లక్షలకు పెంచినట్లు వివరించారు. కేంద్ర ప్రాజెక్ట్ అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో పనులు చేపడుతోందని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా డయాఫ్రం వాల్ దెబ్బతిన్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యంతో రూ.440 కోట్ల వ్యయంతో కట్టిన డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిందని.. ఇప్పుడు మళ్లీ రూ.వెయ్యి కోట్లతో నిర్మాణం చేపట్టామన్నారు. 6-7 ఏళ్ల పాటు ప్రాజెక్ట్ ఆలస్యమై పోయిందని.. ప్రాజెక్టు ఏమైనా పర్వాలేదనే అహంకార ధోరణితో గత పాలకులు వ్యవహరించారని మండిపడ్డారు. వారం రోజుల్లో డయాఫ్రం వాల్ పూర్తవుతుందని, ప్రాజెక్ట్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశానికి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, సీఎస్ సాయి ప్రసాద్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# రాజకీయాల్లో పుల్‌స్టాప్‌లు ఉండవు

**మొదటిపేజీ తరువాయి**

అణగారిన వర్గాలు, రైతులు, కార్మికుల ప్రయోజనాలకు సంబంధించిన సమస్యలపై చర్చించడానికి మరింత అవకాశం ఉండాలి. తరచుగా ఈ సమస్యలను లేవనెత్తినప్పుడు అధికార పార్టీ దానిని విమర్శగా భావించి, కనీసం వినకుండానే ఖండించడం ప్రారంభిస్తుంది. అయితే ప్రభుత్వం ప్రజల ఆందోళనలను తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవాలి" అని అన్నారు. చట్టాల రూపకల్పనలో ప్రతిపక్ష సభ్యులు పాల్గొనేందుకు ఏ ఆటంకం కలిగినా అది పార్లమెంట్ వ్యవస్థను బలహీనపరుస్తుందని అన్నారు. "పార్లమెంట్ సభ్యులకు అందుబాటులో ఉన్న పరిమిత అవకాశాలలో కూడా ముఖ్యమైన అంశాలు ప్రస్తావించినప్పుడు, ఆ వ్యాఖ్యలు పార్లమెంటరీ నియమాలకు విరుద్ధమైనవి కానప్పటికీ, వాటిని తరచుగా సభా కార్యకలాపాల నుంచి తొలగిస్తున్నారు. అని అన్నారు. "రాజ్యసభ కార్య విధాన నియమావళి, సభా కార్యకలాపాల నిర్వహణపై కాలానుగుణ సమీక్ష అత్యవసరం. ఈ అంశం ప్రస్తుతం సాధారణ ప్రయోజనాల కమిటీ (జీపీసీ) పరిశీలనలో ఉంది. దీనిపై తీవ్రంగా చర్చించాల్సిన అవసరం ఉంది. రాజకీయాల్లో పాల్గొనే వారు ప్రజా జీవితం నుంచి ఎన్నడూ విరమించుకోరు. దేశ సేవ చేయాలనే వారి తపనలో వారు ఎన్నడూ అలసిపోరు" అని పేర్కొన్నారు.

**రాజకీయాల్లో పుల్‌స్టాప్‌లు ఉండవు: ప్రధాని మోడీ**

రాజ్యసభలో పదవీ విరమణ చేస్తున్న సభ్యులనుద్దేశించి ప్రధాని మోడీ మాట్లాడుతూ, పదవీకాలం ముగిసినంత మాత్రాన ప్రజాసేవ ముగిసినట్టు కాదన్నారు. రాజ్యసభ మేధావుల వేదిక అని, ఇక్కడ లభించే జ్ఞానానికి విలువ కట్టలేమని తెలిపారు. పార్లమెంట్‌ను ఒక బహిరంగ విశ్వవిద్యాలయంగా పేర్కొంటూ పదవీ విరమణ చేసిన ఎంపీలు తమ జీవితాల్లో చురుకుగా ఉండాలని కోరారు. హెచ్‌డీ దేవెగౌడ, మల్లికార్జున ఖర్గే, శరద్ పవార్ వంటి దిగ్గజ నేతల సహకారాన్ని మరువలేమని, సగానికి పైగా తమ జీవితాన్ని పార్లమెంటుకే అంకితం చేశారని ప్రశంసించారు. కొత్తగా ఎన్నికైన ఎంపీలు వారి నుంచి నేర్చుకోవాల్సినది ఎంతైనా ఉంటుందని సూచించారు.

**మాతో ప్రేమడమోడీతో పెండ్లి**

**మాజీ ప్రధాని దేవెగౌడను ఉద్దేశించి ఖర్గే వ్యాఖ్యలు**

రాజ్యసభలో పదవీకాలం ముగిసిన సభ్యుల వీడ్కోలు సభలో కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే కాసేపు నవ్వులు పూయించారు. మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడను ఉద్దేశించి మాట్లాడుతూ, గత 54 ఏండ్లుగా ఆయన తనకు తెలుసని, ఆయనతో కలిసి పనిచేశానని చెప్పారు. 'అయితే ఏమి జరిగిందో తెలియదు కానీ, ఆయన మాతో ప్రేమ సాగించి మోడీని పెండ్లి చేసుకున్నారు' అంటూ చమత్కరించారు. దీంతో సభలో ఉన్న ప్రధాని మోడీతో సహా సభ్యులంతా నవ్వులు చిందించారు. దేశానికి సేవ చేయాలనే తపన కలిగిన వారు రాజకీయాల్లో, ప్రజా జీవితంలో ఎన్నడూ అలసిపోరని ఖర్గే అన్నారు. కాగా, రాజ్యసభ సభ్యుల వీడ్కోలు సెషన్‌లో శరద్ పవార్, డీఎంకే నేత తిరుచ్చి శివతో తన అనుబంధాన్ని కూడా ఖర్గే గుర్తుచేసుకున్నారు. అయితే పవార్, తిరుచ్చి శివ తిరిగి రాజ్యసభకు రాబోతున్నారు. ఖర్గే తన ప్రసంగంలో కేంద్ర మంత్రి, ఆర్‌పీఐ(ఏ) చీఫ్ రామ్‌దాస్ అథవాలేపై కూడా చలోక్తులు విసిరారు. 'ఆయన ఎప్పుడూ తన కవితల్లో మోడీని పొగుడుతుంటారు. ఆయనకు మరే ఇతర కవితలు తెలియవేమో' అని చెప్పారు.

# ఎగిసిపడిన అగ్నికీలలు..



రామ్‌చౌక్ మార్కెట్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో ఉదయం 7 గంటల సమయంలో మంటలు చెలరేగి, వేగంగా వ్యాప్తి చెందాయి. ప్రమాదం సమాచారం అందుకున్న వెంటనే సహాయక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులతో పాటు బిఎస్ఇఎస్, వైమానిక దళం, ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బందితో సహాయక చర్యల్లో పాల్గొన్నారు. వీరితో పాటు 30 అగ్నిమాపక వాహనాలు, 11 అంబులెన్సులను రంగంలోకి దించారు. మంటలు తీవ్రంగానూ, వేగంగా వ్యాపించడంతో రక్షణ చర్యలు క్లిష్టంగా మారాయి. పైగా అది రద్దీ ప్రాంతం కావడంతో సిబ్బందికి మంటలను అదుపులోకి తీసుకుని రావడం కష్టంగా మారింది. దాదాపు నాలుగు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మంటల భయంతో ఇద్దరు భవనంపై అంతస్తు నుంచి దూకగా, వారికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించారు. స్థానికుల కథనం ప్రకారం ముందుగా మొదటి అంతస్తులో ప్రారంభమైన మంటలు తరువాత వేగంగా భవనం మొత్తం వ్యాప్తించాయి. మొదటి అంతస్తులో రాజేందర్ కశ్యప్ అనే వ్యక్తికి చెందిన వస్త్ర, సౌందర్య సాధనాల షోరూం ఉంది. రాజేందర్ కుటుంబం రెండు, మూడు అంతస్తుల్లో నివసిస్తుంది. మొదటి అంతస్తులో అత్యంత వేగంగా మండే స్వభావం కలిగిన పరిమళ ద్రవ్యాలు, ఇతర సౌందర్య ఉత్పత్తులు ఉండటం వల్ల అక్కడ మంటలు చెలరేగి, వేగంగా వ్యాప్తి చెందాయని స్థానికులు తెలిపారు. అయితే, ఈ అగ్నిప్రమాదానికి గల కచ్చితమైన కారణం ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంలో రాజేందర్ కుటుంబానికి చెందిన తొమ్మిది మంది మృతి చెందారు. ఈ అగ్నిప్రమాదంలో రాజేందర్ భార్య లాడో (70), వారి కుమారులు ప్రవేశ్ (33), కమల్ (39), కమల్ భార్య ఆషు (35)తో పాటు వీరికి చెందిన 15, 6, మూడేళ్ల వయస్సు ఉన్న ముగ్గురు కుమార్తెలు మరణించారు. అదేవిధంగా రాజేందర్, లాడోల కుమార్తె హిమాన్షి (22), కోడలు దీపిక (28) కూడా ఈ అగ్నిప్రమాదంలో మరణించారు. రాజేందర్ మూడవ కుమారుడైన 32 ఏళ్ల అనిల్, తన రెండేళ్ల కుమార్తెను భవనం నుంచి దించే ప్రయత్నంలో మూడో అంతస్తు నుంచి ఆమెను కింద పడేశాడు. తరువాత. అతను కూడా దూకేశాడు. ఇద్దరికీ గాయాలయ్యాయని, చికిత్స పొందుతున్నారని అధికారులు తెలిపారు. రాజేందర్ నాల్గో కుమారుడు 29 ఏళ్ల సచిన్‌కు 25 శాతం గాయాలయ్యాయి. సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, రాజేందర్ గోవా వెళ్లగా, కుమారుల్లో మరొకరు కుటుంబంతో సహా విహారయాత్రకు వెళ్ళారు.

# డ్రగ్స్ కేసులో మా ప్రమేయం లేదు

**మొదటిపేజీ తరువాయి**

ఈ వ్యవహారంపై దర్యాప్తునకు సిట్ వేశాం అని చెప్పారు. 2029లోనే తెలంగాణలో ఎన్నికలు జరుగుతాయని సీఎం అన్నారు. 2028లో ఎన్నికలు రావని చెప్పారు. మహిళా రిజర్వేషన్లు ముందుగా అమల్లోకి వస్తే మంచిదేనని అభిప్రాయపడ్డారు. అంతకుముందు పార్లమెంట్‌లో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీలను రేవంత్‌రెడ్డి కలిశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి వెళ్లి వారితో సమావేశమయ్యారు. ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన వేం నరేందర్‌రెడ్డిని రాహుల్, ప్రియాంకలకు రేవంత్ పరిచయం చేశారు. పార్లమెంట్‌లో వైసీపీ నేత, మాజీ మంత్రి రోజా సీఎం రేవంత్ రెడ్డి, ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా వారిరువురు ఒకరినొకరు పలకరించుకున్నారు.

# అకాల వర్షాలకు నలుగురు మృతి

**మొదటిపేజీ తరువాయి**

తాడేపల్లిలోనూ ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. రాజధాని పనుల్లో భాగంగా బిఎస్ఆర్ కంపెనీలో మేనేజరుగా పనిచేస్తున్న రాజమహేంద్రవరానికి చెందిన శ్రీనివాసరావు వర్షం వస్తుండడంతో తుళ్లూరు మేరిమాత స్కూలు మైదానంలో వేచి ఉండగా సమీపంలో పిడుగుపడడంతో షాక్‌కు గురయ్యారు. ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. గుంటూరు జిల్లాలో పలుచోట్ల అరటి తోటలు నేల వాలాయి. మిర్చి, అపరాల పంటలకు నష్టం వాటిల్లింది. గుంటూరు మిర్చి యార్డులో విక్రయానికి తీసుకొచ్చిన మిర్చి పాక్షికంగా తడిసింది. పల్నాడు జిల్లాలో కళ్లాల్లో ఆరబోసిన మిర్చి తడిసిపోయింది. నూజెండ్ల మండలం నాగిరెడ్డిపాలెంలోని పొలంలో మిరపకాయలు కోస్తుండగా పిడుగుపడడంతో ప్రకాశం జిల్లాకు చెందిన వలస కార్మికులు కంటూరి సుబ్బరత్నమ్మ (55) మరణించారు. బాపట్ల జిల్లా నగరం మండలం ధూళిపూడి గ్రామానికి చెందిన పెరవలి వనజ (35) పిడుగుపాటుకు మృతి చెందారు. నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం పడమరప్రాతకోట గ్రామంలో భారీ వర్షానికి గోడకూలి ఏడాది బాలుడు మరణించాడు. ఆత్మకూరు, మంత్రాలయంలో వడగండ్ల వాన పడింది. కర్నూలు నగరంలో తేలికపాటి వర్షం కురిసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా జికె.వీధి మండలం ధారకొండలో గంటసేపు కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారిపై వర్షపు నీరు పొంగి ప్రవహించింది. ధారాలమ్మ అమ్మవారి సందర్శనకు వచ్చిన యాత్రికులు ఇబ్బందులకు గురయ్యారు. సీలేరులో భారీ వర్షం పడింది. జి.మాడుగుల, అరకులోయ మండలాల్లో కొన్నిచోట్ల మోస్తరు వర్షం పడగా, మరికొన్ని చోట్ల చిరుజల్లులు కురిశాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పలుచోట్ల తేలికపాటి వర్షాలు పడ్డాయి. అనంతపురం, గుంతకల్లు, పుట్టపర్తి, ధర్మవరం, హిందూపురం, పెనుకొండ ప్రాంతాల్లో ఈదురుగాలుతో కూడిన వర్షం కురిసింది. భారీ వర్షానికి ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలోని పలు లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. భవానీపురం, పాత హెచ్‌బి కాలనీ, రోటరీనగర్, కబేళా, రామరాజ్యనగర్, ఇస్లాంపేట, వించిపేట, నైజాంగేట్, కెఎల్‌రావు నగర్‌లోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. ద్విచక్ర వాహనదారులు, చిరు వ్యాపారులు అవస్థలు పడ్డారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఏలూరు నగరంలో కురిసిన కొద్దిపాటి వర్షానికి రోడ్లన్నీ బురదమయంగా మారడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలుచోట్ల తేలికపాటి జల్లులు పడ్డాయి.

# ఐదేళ్లలో జగన్ ఎందుకు వివేకా కేసు తవ్వలేదు

**మొదటిపేజీ తరువాయి**

అవినాశ్‌రెడ్డి మాట్లాడటం చాలా దారుణమని అన్నారు. అవినాశ్‌రెడ్డికి పలుకుబడి, డబ్బు ఉందని, ఎన్ని తప్పులు చేసిన తప్పించుకోవచ్చని అనుకుంటున్నారా..? అని ప్రశ్నించారు. సోషల్ మీడియాను చేతిలో పెట్టుకుని వ్యక్తిత్వ హననం చేయాలనుకుంటున్నారని ధ్వజమెత్తారు. వివేకానంద గుండెపోటుతో చనిపోయారని సాక్షి మీడియాలోనే మొదటగా ప్రచారం చేశారని షర్మిల ప్రస్తావించారు. స్థానికంగా ఉన్న అవినాశ్‌రెడ్డి, సాక్షి యజమాని భారతిరెడ్డి ఎందుకు గుండెపోటని ప్రచారం చేశారో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఈ హత్య ముమ్మాటికీ కడప ఎంపీ టిక్కెట్టు విషయంలోనే జరిగిందని చెప్పుకొచ్చారు. ఈ విషయంపై వివేకానంద స్వయంగా తనతో చర్చించారని తెలిపారు. అవినాశ్‌రెడ్డికి టిక్కెట్టు ఇస్తే, వివేకానంద సపోర్ట్ చేశారని గుర్తుచేశారు. ఎప్పటికైనా వివేకానంద బతికి ఉంటే, తనకు ఇబ్బంది అవుతుందనే కారణంతోనే అవినాశ్‌రెడ్డి ఈ హత్య చేశారని ఆరోపించారు. వివేకా హత్య కేసులో మొదటగా సీబీఐ విచారణ కావాలని జగన్ అన్నారని, ఆ తర్వాత వద్దని కూడా ఆయనే చెప్పారని తెలిపారు. వివేకా కేసును సిట్ అధికారులతో విచారణ చేయిస్తే సరిపోతుందని జగన్ చెప్పారని అన్నారు. ఈ కేసులో సీబీఐ అన్ని ఆధారాలను సేకరించిందని, ప్రధానంగా అవినాశ్‌రెడ్డి పేరును ప్రస్తావించిందని తెలిపారు. జగన్ హయాంలోని ఐదేళ్లలో ఎందుకు ఒక్క ఆధారం కూడా బయటపెట్టలేక పోయారని ప్రశ్నల వర్షం కురిపించారు. సునీతారెడ్డి చంద్రబాబు కోసం పనిచేస్తున్నారని చెబుతూ.. అవినాశ్‌రెడ్డిని కాపాడుకోవాలని జగన్ ప్రయత్నిస్తున్నారని షర్మిల అన్నారు. సునీతకు ప్రాణహాని ఉందని, అయినా ఆమె పోరాటం చేస్తున్నారని చెప్పుకొచ్చారు. తన తండ్రి హత్య వెనుక ఉన్న నిజాన్ని బయటకు తీసుకురావాలని సునీత పోరాటం చేస్తున్నారని అన్నారు. 'జగన్ అన్నకు కూసింతైనా కనికరం లేదా..? ఇలాంటి అన్న ఉంటే శత్రువులు అనవసరం.. అన్నా అనే పదానికే ఆయనో కళంకం. జగన్ మోహన్‌రెడ్డి బాధితులపట్ల కాకుండా నిందితులపట్ల నిలబడ్డారనే విషయం వైఎస్ రాజశేఖర్ రెడ్డికి తెలిస్తే ఎంతగానో బాధపడేవారు. వివేకా హత్య కేసులో న్యాయం కోసమే చంద్రబాబును కలిశారని.. నిరంతరం పోరాటం సాగిస్తున్నారని.. కానీ న్యాయం మాత్రం జరగట్లేదని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు.

# దివ్యాంగుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం..!

## 'దివ్యాంగ శక్తి' ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రారంభించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.

## దివ్యాంగుల శ్రేయస్సుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. -..జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్.














**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి, 18:**
దివ్యాంగులు సమాజంలో ఆత్మగౌరవంతో, సమాన అవకాశాలతో జీవించాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇంద్రధనుస్సు' కార్యక్రమంలో భాగంగా 'దివ్యాంగ శక్తి' (ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం) పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. బుధవారం స్థానిక నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో "దివ్యంగ శక్తి" పథకాన్ని రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం రజియా సుల్తానా, నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న, నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాజ్, ఏపీఎస్ఆర్టీసీ, రెవెన్యూ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో దివ్యాంగ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ రాష్ట్రవ్యాప్తంగా ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు 100% ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం ద్వారా వారిపై ఆర్థిక భారాన్ని తగ్గించడమే కాకుండా, వారు స్వేచ్ఛగా తిరిగేలా ప్రభుత్వం భరోసా ఇస్తోందని తెలిపారు. ఈ పథకం ద్వారా దివ్యాంగులు విద్య, ఉపాధి, మరియు ఆరోగ్య అవసరాల కోసం ఎక్కడికైనా సులభంగా వెళ్లవచ్చు అని, ఇది వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుందని అన్నారు. ఏ ఒక్క పౌరుడు వివక్షకు గురికాకూడదనే లక్ష్యంతో, అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలన్న ముఖ్యమంత్రి గారి సంకల్పానికి ఈ కార్యక్రమమే నిదర్శనం అన్నారు.
జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల శ్రేయస్సు కోసం "దివ్యాంగ శక్తి" అనే పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ పథకం ద్వారా పిడబ్ల్యుడి చట్టంలోని 21 వైకల్యాలు ఉన్న దివ్యాంగులు సిటీ బస్సులు, పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, మెట్రో ఎక్స్ప్రెస్, ఎక్స్ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసే అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా దివ్యాంగులకు సహాయకులుగా వచ్చే వారికి కూడా టికెట్ ధర మొత్తంలో 50 శాతం మినహాయింపు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. అంతేకాకుండా ప్రీమియం ఏసి, డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే దివ్యాంగులకు కూడా 50% టికెట్ రుసుములో మినహాయించే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం మంత్రి ఫరూక్, జాయింట్ కలెక్టర్ దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించారు.

## రాష్ట్ర అత్యున్నత 'కళారత్న' పురస్కారానికి

# బీసీ రాజారెడ్డి ఎంపిక



**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె మార్చి 18:**
రాష్ట్ర ప్రభుత్వం తెలుగు నూతన శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉగాది రోజున వివిధ రంగాల్లో నిష్టానుతులైన(కళ, సామాజిక సేవ, సాహిత్యం, సంగీతం, గాత్రం ) వారికి అందించే ప్రతిష్టాత్మక కళారత్న (హంస), ఉగాది పురస్కారాలను ప్రకటించిన జాబితాలో ఉమ్మడి జిల్లాలో నంద్యాల జిల్లా నుంచి సామాజిక సేవకుడు ,శ్రీ అరుణ భారతి సాహితీ సంస్థ వ్యవస్థాపకులు బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి కళారత్న పురస్కారానికి ఎంపికయ్యారు. గురువారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే రాష్ట్ర ప్రభుత్వ ఉగాది వేడుకల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్నీ అందుకోనున్నారు.

### సాహితీ,సామాజిక సేవాతత్పరుడు బీసీ రాజారెడ్డి

నంద్యాల జిల్లాబనగానపల్లె పట్టణానికి చెందిన బీసీ రాజారెడ్డికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సమాజ సేవకుడిగా మంచి పేరుంది. ఈయన గతంలో బనగానపల్లెకు సర్పంచిగా సేవలందించి ఉత్తమ పంచాయితీగా తీర్చిదిద్దారు. అదే విధంగా శ్రీ అరుణ భారతీ సాంస్కృతిక సాహితీ సంస్థను స్థాపించి సేవలందిస్తున్నారు. 34 ఏళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు చేసి పేదలకు అండగా నిలిచారు. అనేక నాటక ప్రదర్శనలు నిర్వహించారు. ప్రతి ఏడాది పేద విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేయడంతో పాటు అంధులకు ప్రతి నెలా సొంత నిధులతో పింఛన్లను పంపిణీ చేస్తున్నారు. ప్రతి ఏటా రూ.4 లక్షల నగదు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేస్తూ విద్యార్థులను ప్రోత్సాహిస్తున్నారు. అనేక ప్రాంతాల్లో ఉచితంగా తాగునీటి మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు దాహార్తిని తీర్చారు. ఆయనకు ఉగాది పురుస్కారం ప్రకటించడంపై పలువురు అభినందనలు తెలియజేశారు.

# దివ్యాంగులతో కలిసి భోజనం చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.

## నంద్యాల కలెక్టరేట్ ప్రాంగణంలో ఆత్మీయ కలయిక. -దివ్యాంగుల సమస్యలు అడిగి తెలుసుకున్న మంత్రి ఫరూక్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి 18:**
దివ్యాంగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న ఆదరణకు, మమకారానికి నేడు నంద్యాల కలెక్టరేట్ సాక్ష్యంగా నిలిచింది. 'దివ్యాంగ శక్తి' ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రారంభించిన అనంతరం, రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో దివ్యాంగులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మంత్రి ఫరూక్ స్వయంగా దివ్యాంగుల మధ్య కూర్చుని, వారితో కలిసి భోజనం చేస్తూ ఆత్మీయంగా మాట్లాడారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలు వారికి అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. భోజన సమయంలో దివ్యాంగులు తమ ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకురాగా, వాటిని సానుకూలంగా విన్న ఆయన, తక్షణమే పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని భరోసా ఇచ్చారు. భోజనం అనంతరం మంత్రి ఫరూక్ మాట్లాడుతూ.. ఈ రోజు మీ అందరితో కలిసి కూర్చుని భోజనం చేయడం నాకు ఎంతో తృప్తినిచ్చిందని . మిమ్మల్ని దివ్యాంగులుగా చూడటం లేదు, నా కుటుంబ సభ్యులుగా భావిస్తున్నానని అన్నారు . మీ చిరునవ్వులే మా ప్రభుత్వానికి అసలైన బలం." అని తెలిపారు. భోజన సమయంలో మీరు నా దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను నేను స్వయంగా నోట్ చేసుకున్నానని, వీటన్నింటినీ తక్షణమే పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించానని తెలిపారు . అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామన్నారు. ఇప్పటివరకు ప్రయాణం కోసం మీరు ఇబ్బందులు పడేవారు. కానీ ఇప్పుడు 'దివ్యాంగ శక్తి' పథకం ద్వారా మీరు ఎక్కడికైనా ఉచితంగా వెళ్లవచ్చు అని . ఇది కేవలం పథకం కాదు, మీ ఆత్మగౌరవ ప్రయాణం." అని తెలిపారు శారీరక వైకల్యం మీ ప్రతిభకు అడ్డంకి కాకూడదని . విద్య, ఉపాధి రంగాల్లో మీరు రాణించేలా ప్రభుత్వం అన్ని రకాల మద్దతు ఇస్తుందని . మీలో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడమే మా సంకల్పం అన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో మాది సంక్షేమ పాలన అని, వివక్ష లేని సమాజాన్ని నిర్మించడమే మా ధ్యేయం." అన్నారు.
మంత్రి ఫరూక్ గారు ప్రోటోకాల్ పక్కన పెట్టి తమతో కలిసి సామాన్యుడిలా భోజనం చేయడం పట్ల దివ్యాంగులు హర్షం వ్యక్తం చేశారు.
ఈ ఆత్మీయ భోజన కార్యక్రమంలో నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, మున్సిపల్ కమిషనర్ శేషన్న, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, రజియా సుల్తానా, దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, ఇతర రెవెన్యూ మరియు ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

# జాబ్ మేళా ను సద్వినియోగం చేసుకోండి

## -మంత్రి ఎన్ఎండి ఫరూక్.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 18:**
గ్రామీణ , పట్టణ ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ యువతీ , యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా నంద్యాలలో మార్చి 25 తేదీ స్థానిక ఎన్టీఆర్ షాది ఖానా నందు జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం (రాజ్ టాకీస్) నందు జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్ ను డిస్టిక్ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి , ప్లేస్మెంట్ ఆఫీసర్ సుబ్బన్న , స్కిల్ హబ్ కోఆర్డినేటర్ మస్తాన్ వలి తో కలిసి మంత్రి ఎన్ఎండి ఫరూక్ పోస్టర్లను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ.. నంద్యాల నియోజకవర్గ మరియు చుట్టుపక్కల ప్రాంతాల నిరుద్యోగ యువతీ యువకులకు నిర్వహించిన జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 13 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొనబోతున్నాయని, దాదాపు 920 పైగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు . నిరుద్యోగులు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని ప్రతి నెల జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందన్నారు. 20 లక్షల ఉద్యోగాలు ఐదు సంవత్సరాలలో ఇవ్వాలనేదే తెలుగుదేశం పార్టీ ఆశయమన్నారు. ఈ ఆశయానికి అనుగుణంగా మంత్రి నారా లోకేష్ సారథ్యంలో ఖచ్చితంగా సాధిస్తామని ప్రతి నిరుద్యోగికి ఉద్యోగ అవకాశం కల్పించే బాధ్యత తీసుకుంటామన్నారు. అలాగే నాకు తెలిసిన హైదరాబాద్ కంపెనీస్ కూడా నంద్యాలకు తీసుకుని వచ్చి జాబ్ మేళా నిర్వహిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు.

## నంద్యాల 38వ వార్డు ప్రజలకు

# ఉగాది శుభాకాంక్షలు.

**..తాటికొండ బుగ్గ రాముడు.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 18:**
నంద్యాల జిల్లా ప్రజలకు అధికారులకు నాయకులకు మరియు నంద్యాల 38వ వార్డు ప్రజలకు 38వ వార్డు టిడిపి ఇన్చార్జ్ తాటికొండ బుగ్గ రాముడు తెలుగు సంవత్సరాది ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ కొత్త సంవత్సరంలో న్యాయ మైనార్టీ శాఖ మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్ వారి తనయులు ఎన్.ఎం.డి ఫిరోజ్ ఎన్ ఎండి ఫయాజ్ సహకారంతో 38 వార్డును మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని అలాగే మన సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసే పండుగే ఉగాది అన్నారు. శ్రీ పరాభవ నామ సంవత్సరం అందరికీ శుభాలు కలగజేయాలని ఆకాంక్షించారు. అందరూ కుటుంబ సభ్యులతో కలిసి ఉగాది పండుగను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని తాటికొండ బుగ్గ రాముడు సూచించారు.

# గ్యాస్ సిలిండర్ బ్లాక్ లో అమ్మితే కఠిన చర్యలు.

## ..ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ.



**ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ మార్చి 18:** తాసిల్దార్ కార్యాలయంలో, ఆరు మండలాలకు సంబంధించిన ఎమ్మార్వోలు మరియు డిటి, గ్యాస్ ఏజెన్సీ వారితో సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పాల్గొన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాలు నమ్మవద్దని గ్యాస్ అందరికీ అందుబాటులో ఉందని, ప్రజలందరూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని, అన్ని మండలాలకు సంబంధించి హెడ్ క్వార్టర్లో, ఎమ్మార్వో ఏజెన్సీ డిటి ఎమ్మెల్యే నెంబర్లు మరియు హెల్ప్ లైన్ నెంబర్ అందుబాటులో ఉంటుంది ఎవరికి ఏ సమస్య వచ్చినా తక్షణమే కాల్ చేసి పరిష్కారం జరుగుతుందని తెలిపిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ. హాస్టల్ మరియు స్కూల్ పిల్లలకు గ్యాస్ సదుపాయం త్వరగా అందించాలని, ఎవరైనా గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకుని బ్లాక్లో అమ్మితే కఠిన చర్యలు తప్పవని తెలిపిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు గ్యాస్ అందేలాగా కృషి చేస్తుందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు.

# మహిళా సాధికారతతో సమాజ అభివృద్ధి సాధ్యం

## జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షురాలు విజయ రహత్కర్ -జిల్లాలో సమస్యలపై కట్టుదిట్టమైన చర్యలు

## గత ఏడాదితో పోలిస్తే కేసులు తగ్గినట్లు వెల్లడి -జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 18:**
మహిళా సాధికారతతో సమాజ అభివృద్ధి సాధ్యమని జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షురాలు విజయ రహత్కర్ అన్నారు. బుధవారం శ్రీశైలంలోని దేవస్థాన కార్యనిర్వహణాధికారి కార్యాలయం లోని మీటింగ్ హాల్ నందు జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షురాలు మాట్లాడుతూ, డా. బి.ఆర్. అంబేద్కర్ చెప్పిన "సమాజ పురోగతిని మహిళల అభివృద్ధితోనే అంచనా వేయాలి" అనే సూక్తిని ప్రస్తావిస్తూ, మహిళా సాధికారతే సమాజ అభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా 550 జిల్లాల్లో 'మహిళా జనసునావి' కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఐదు జిల్లాల్లో విజయవంతంగా నిర్వహించిన ఈ కార్యక్రమాల ద్వారా గృహ హింస, బలవంతపు శ్రమ, వృద్ధ మహిళలపై దౌర్జన్యాల వంటి అంశాలపై నేరుగా ఫిర్యాదులను స్వీకరించి పరిష్కార చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా 2022 ఏప్రిల్ 4న ఏర్పడిన నంద్యాల జిల్లా పరిపాలన, ఆర్థిక మరియు సామాజిక రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. 2025 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు 20.27 కోట్లకు పైగా డిజిటల్ లావాదేవీలు నమోదై, వాటి విలువ రు.1.09 లక్షల కోట్లకు చేరినట్లు తెలిపారు. వ్యవసాయ రంగంలో డిఎపి ఎరువుల వినియోగంలో దేశంలో అగ్రస్థానంలో నిలవడం విశేషమని పేర్కొన్నారు. ఈ విజయాల్లో మహిళల పాత్ర కీలకమని కొనియాడారు.

### శ్రీశైలం ప్రాధాన్యత

శ్రీశైలం దేవస్థానం వద్ద ఉగాది సందర్భంగా లక్షలాది మంది భక్తులు తరలివస్తారని, ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం వారి ఆత్మవిశ్వాసానికి నిదర్శనమని తెలిపారు. శక్తిపీఠం మరియు జ్యోతిర్లింగం ఒకేచోట ఉండటం "శివ-శక్తి ఏకరూపం"కు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మహిళలపై నేరాల్లో 4.4 శాతం తగ్గుదల నమోదవడం సానుకూల పరిణామమని తెలిపారు. 'శక్తి టీమ్', 'స్త్రీ శక్తి' పథకాలు ద్వారా మహిళలకు భద్రత, సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా కోట్లాది ప్రయాణాలను సులభతరం చేసినట్లు పేర్కొన్నారు. 'ఆపరేషన్ ద్వారా వేలాది అదృశ్య




మహిళలు, బాలికలను గుర్తించినట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో గర్భిణీల కోసం 35 బర్త్ వెయిటింగ్ రూమ్‌ల నిర్మాణం, మహిళల ఉపాధి కోసం "వర్క్ ఫ్రం హోమ్" పథకం అమలు వంటి చర్యలను వివరించారు. మహిళలు, బాలికలు అదృశ్యమవుతున్న కేసులు, సోషల్ మీడియాలో అసభ్య వ్యాఖ్యలు, ఏజెన్సీ ప్రాంతాల్లో బాల్య గర్భధారణలు పెరుగుతున్న అంశాలు ఆందోళనకరమని పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు సమాజానికి హెచ్చరికగా పరిగణించాలని సూచించారు. మహిళా భద్రత, సంక్షేమ పథకాల సమర్థ అమలుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని సూచించారు. ఆంగన్‌వాడీ, ఆరోగ్య, విద్యా శాఖల సమన్వయంతో బాలికల ఆరోగ్యం, పోషణపై దృష్టి సారించాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాల ప్రోత్సాహం, బాల్య వివాహాలు, గర్భధారణ నివారణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వన్ స్టాప్ సెంటర్, 181 హెల్ప్‌లైన్ సేవలను మరింత బలోపేతం చేయాలని చైర్ పర్సన్ ఆదేశించారు. గృహ హింస నిరోధక చట్టం-2005పై విస్తృత ప్రచారం చేపట్టి, రక్షణ అధికారుల నియామకాన్ని వేగవంతం చేయాలని తెలిపారు. మహిళా సాధికారత, భద్రత, సంక్షేమం అంశాల్లో సమగ్ర చర్యల ద్వారా నంద్యాల జిల్లాను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దవచ్చని అధ్యక్షురాలు ఆశాభావం వ్యక్తం చేశారు. నంద్యాల వంటి వ్యవసాయాధారిత జిల్లాల్లో మహిళల భద్రతకు 'లోకల్ కమిటీ'లు కీలక పాత్ర పోషిస్తాయని, వీటి ఏర్పాటు చట్టపరంగా తప్పనిసరని పేర్కొన్నారు. గృహ హింస చట్టం అమలులో భాగంగా రక్షణ అధికారులను నియమించాలని సుప్రీంకోర్టు ఆదేశాలను గుర్తుచేస్తూ, బాధిత మహిళలకు సమయానుకూల సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, పని ప్రదేశాల్లో మహిళలకు న్యాయం జరిగేలా లైంగిక వేధింపుల నిరోధక చట్టం కింద కమిటీలు చురుగ్గా పనిచేయడం అవసరమని వివరించారు. మహిళా భద్రత విషయంలో పోలీసు విభాగం అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి ఫిర్యాదుపై సున్నితంగా మరియు వేగంగా స్పందించాలని కోరారు. 'శక్తి టీమ్స్' పనితీరును మరింత మెరుగుపరుస్తూ గ్రామీణ స్థాయిలో కూడా వాటి ఉనికిని పెంచాలని సూచించారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో సోషల్ మీడియా పర్యవేక్షణను బలోపేతం చేయడం అత్యవసరమని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా పోక్సో మరియు గృహ హింస కేసుల్లో త్వరితగతిన విచారణ జరిపి బాధితులకు త్వరగా న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు మరియు చట్టాల అమలులో ఎటువంటి ఆటంకాలు లేకుండా మహిళల అభివృద్ధిని సాధించడమేనని తెలిపారు. నంద్యాల జిల్లా ఇప్పటివరకు మంచి పనితీరును కనబర్చిందని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాల కోసం అధికారులు సమన్వయంతో కృషి చేయాలని మహిళా కమిషన్ అధ్యక్షురాలు పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లా పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లా నుండి విడిపోయి నంద్యాల జిల్లా ఏర్పడిందని కలెక్టర్ వివరించారు. ఈ జిల్లాలో ఒక పార్లమెంటరీ నియోజకవర్గం, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నట్లు తెలిపారు. భౌగోళికంగా ప్రాధాన్యం కలిగిన శ్రీశైలం క్షేత్రం నల్లమల అరణ్యాల మధ్య, కృష్ణా నది తీరాన విరాజిల్లుతూ ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రసిద్ధి చెందిందని చెప్పారు. అక్టోబర్ 16న భారత ప్రధాని నరేంద్ర మోదీ శ్రీశైలాన్ని సందర్శించడం ద్వారా ఈ ప్రాంతానికి భక్తులు, పర్యాటకుల రాక గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు.

### మహిళా, శిశు సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో మహిళా, శిశు సంక్షేమ కార్యక్రమాల అమలుపై చీజఔ ప్రతినిధి శైలజ సమీక్ష నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. బాల్య వివాహాల నిర్మూలనలో జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా పనిచేస్తోందని, ఈ కృషిని శైలజ గారు అభినందించినట్లు చెప్పారు. కౌమార దశలో ఉన్న బాలికల ఆరోగ్యం, సాధికారత కోసం "కిషోరీ బాలిక వికాసం" కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. అలాగే, జిల్లాలో 1663 అంగన్‌వాడీ కేంద్రాలు కార్యకలాపాలు నిర్వహిస్తూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందిస్తున్నాయని తెలిపారు. పిల్లల్లో స్టంటింగ్, వేస్టింగ్ సమస్యలను తగ్గించే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు.

### మహిళల రక్షణకు మౌలిక వసతులు

జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మహిళల భద్రత, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పలు కీలక విభాగాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనాథ, నిరాశ్రయ పిల్లల కోసం శిశు గృహం ఏర్పాటు చేసామన్నారు. బాలల రక్షణ కోసం డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ సమర్థవంతంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న మహిళలకు తక్షణ సహాయం అందించేందుకు వన్ స్టాప్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక, ఉద్యోగినుల కోసం జిల్లాకు రెండు వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్ మంజూరయ్యాయని, ప్రస్తుతం అద్దె భవనాల్లో కార్యకలాపాలు ప్రారంభించి, త్వరలో శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించామని అధికారిణి తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే కేసుల సంఖ్య 722 నుండి 500కు తగ్గి గణనీయమైన తగ్గుదల నమోదైందని చెప్పారు. జూన్ 24 తర్వాత వివాహాలు అధికంగా జరిగే అవకాశముండటంతో, అన్ని ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుని మరింత కఠినంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కేవలం కౌన్సెలింగ్ ద్వారా ఆశించిన ఫలితాలు రావడం లేదని, అందువల్ల ఎఫ్ఐఆర్





నమోదు చేయడం వంటి కఠిన చర్యలు కూడా అమలు చేస్తున్నామని కలెక్టర్ వివరించారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ మాట్లాడుతూ జిల్లా ఏర్పాటైనప్పటి నుండి మహిళా భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పలు సమర్థవంతమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు జిల్లాలోని మొత్తం 40 పోలీస్ స్టేషన్లలో ప్రత్యేక మహిళా హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే ప్రతి సోమవారం ప్రత్యేక పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్ నిర్వహిస్తూ మహిళల సమస్యలను వేగంగా పరిష్కరించే చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వుమెన్ పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్సైలు మరియు 20 మంది సిబ్బంది సేవలందిస్తున్నట్లు ఎస్పీఇటీవల సంవత్సరాల్లో మహిళలపై జరిగే నేరాల నియంత్రణలో గణనీయమైన పురోగతి కనిపిస్తోందన్నారు. 2024తో పోలిస్తే 2025లో మహిళలపై నేరాలు సుమారు 10 శాతం తగ్గగా, ముఖ్యంగా అత్యాచార కేసులు 60 శాతం వరకు తగ్గాయన్నారు. జిల్లాలో శక్తి బృందాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. మొత్తం ఆరు బృందాలు పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో పర్యటిస్తూ మహిళా రక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదనంగా, నేరాలు జరిగే అవకాశమున్న హాట్‌స్పాట్ ప్రాంతాల్లో నిరంతర పెట్రోలింగ్ నిర్వహిస్తూ అప్రమత్తత పెంచుతున్నామన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..!

**- మంత్రి ఎన్ఎండి ఫరూక్.**

**నంద్యాలలో 'రైతన్న సేవలో మన మంచి ప్రభుత్వం' కరపత్రాల విడుదల.**

**అన్నదాత సుఖీభవ పి.ఎం. కిసాన్ ద్వారా రైతులకు ఏడాదికి రూ. 20,000 ఆర్థిక సాయం.**

**వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ఐదు అంచెల వ్యూహం.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి 18:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి వర్యులు ఎన్ఎండి ఫరూక్ తెలిపారు.బుధవారం నంద్యాలలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో 'రైతన్న సేవలో... మన మంచి ప్రభుత్వం' మరియు 'రైతన్న! మీ కోసం' పేరుతో రూపొందించిన ప్రత్యేక కరపత్రాలను స్థానిక రైతులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వ్యవసాయాన్ని కేవలం జీవనాధారంగానే కాకుండా, గౌరవప్రదమైన లాభసాటి రంగంగా మార్చడానికి కట్టుబడి ఉందన్నారు. ప్రతి రైతు కుటుంబానికి 'అన్నదాత సుఖీభవ పి.ఎం. కిసాన్' పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ. 14,000, కేంద్రం రూ. 6,000 కలిపి ఏటా రూ. 20,000 నేరుగా ఖాతాల్లో జమ చేసిందని తెలిపారు. మార్చి 13, 2026న మూడవ విడత నిధులు కూడా విడుదలయ్యాయని గుర్తుచేశారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్ (ఏఐ మరియు డ్రోన్లు), ఫుడ్ ప్రాసెసింగ్ మరియు ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు అనే ఐదు సూత్రాలతో రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.
రాయలసీమను 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్'గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని, బిందు, తుంపర సేద్యానికి ఎస్సీ, ఎస్టీ రైతులకు 100%, ఇతరులకు 90% వరకు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు . సాగులో ఏఐ , శాటిలైట్ సర్వేలు, డ్రోన్ల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని, దీనికోసం 'ఫార్మర్ యాప్' అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. ఉల్లి, కోకో, ఆయిల్ పామ్ రైతులకు అదనపు ప్రోత్సాహకాలు అందించడంతో పాటు, నల్లబరి పొగాకు రైతులకు గతంలో ఎన్నడూ లేని విధంగా మద్దతు ధర కల్పించి ఆదుకున్నామని మంత్రి ఫరూక్ తెలిపారు . రైతులు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఎకరాకు సాగునీరు, ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించే వరకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, నంద్యాల మండల టీడీపీ కన్వీనర్ మునగాల విశ్వనాథ్ రెడ్డి, యాలూరు వెంకటేశ్వర్ రెడ్డి , చంద్రశేఖర్ రెడ్డి , కొల్లి చంద్రశేఖర్ రెడ్డి, పుండరీశ్వర్ రెడ్డి , గోవింద నాయుడు, కృపాకర్ , సుధాకర్, ఓబులేసు పలువురు రైతులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రామాపురం గ్రామంలో 15మంది సభ్యులతో బిజెపి గ్రామ కిసాన్ మోర్చా కమిటీ ఏర్పాటు..!

**-బిజెపి కిసాన్ మోర్చా నంద్యాల జిల్లా అధ్యక్షులు బిజ్జం సుబ్బారెడ్డి.**

**ఆంధ్ర ప్రగతి బండి ఆత్మకూరు మార్చి 18:**
బండిఆత్మకూరు మండలం రామాపురం గ్రామంలో బిజెపి కిసాన్ మోర్చా నంద్యాల జిల్లా అధ్యక్షులు బిజ్జం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో 15మంది సభ్యులతో కూడిన బిజెపి గ్రామ కిసాన్ మోర్చా కమిటీ ఏర్పాటు చెయ్యడమైనది. బిజెపి బలోపేతమే ద్యేయంగా జిల్లా లోని ప్రతి గ్రామంలో బిజెపి కిసాన్ మోర్చా గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని, కిసాన్ మోర్చా నంద్యాల జిల్లా అధ్యక్షులు బిజ్జం సుబ్బారెడ్డి తెలిపారు. రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ మరియు కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కిసాన్ మోర్చా గ్రామ కమిటీలు ఏర్పాటు చెయ్యాలని సూచించారని, అందులో భాగంగా నంద్యాల జిల్లాలో కిసాన్ మోర్చా కమిటీలు వేసున్నామని బిజ్జం సుబ్బారెడ్డి అన్నారు. ప్రధాన మంత్రి మోడీ విధానాలు గ్రామ ప్రగతికి ఎంతగానో దోహద పడుతున్నాయని అలాగే ముఖ్యంగా రైతులకోసం వ్యవసాయ రంగం కోసం కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తున్న తీరుపట్ల నమ్మకంతో బిజెపి లోకి అన్ని గ్రామాల్లో రైతులు పెద్దఎత్తున చేరబోతున్నారని బిజ్జం తెలియజేశారు. వచ్చే నెలలో ఏప్రిల్ 6వ తేదీ బిజెపి ఆవిర్భావ దినోత్సవం నాటికి జిల్లాలోని చాలా గ్రామాల్లో గ్రామ కిసాన్ మోర్చా కమిటీలు ఏర్పాటు చేస్తామని బిజ్జం తెలిపారు. కిసాన్ మోర్చా గ్రామ కమిటీల సహకారంతో "మన ఊరు- మన జెండా" కార్యక్రమం ప్రతి గ్రామంలో బిజెపి జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు ఆధ్వర్యంలో నిర్వహిస్తామని బిజ్జం సుబ్బారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డొల్లు శంకరయ్య, బేరి హరిబాబు, డొల్లు రామకృష్ణుడు, నీలకంఠం శ్రీకాంత్, గాజులు వెంకటేష్, సాయన్న గారి రామకృష్ణ, గండూరి సుభాష్, డొల్లు మహేష్, యర్రం మోహన్, గండూరి వెంకటరమణ, దబడపల్లె వెంకటరమణ, బంగి వెంకటేష్, చాకలి ఎల్లయ్య, వడ్డే ఎల్లయ్య, రామిశెట్టి భాస్కర్, తదితరులు మరియు బిజెపి నాయకులు పాల్గొన్నారు.



# స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు ప్రశంసనీయం.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 18:**
నంద్యాల జాయింట్ కలెక్టర్ శ్రీ కొల్లాబత్తుల కార్తీక్ మూడు రోజులపాటు జె.కే ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన స్వయం సహాయక సంఘాల మేళాను నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రతి స్టాలును సందర్శించి ప్రదర్శించినటువంటి ఉత్పత్తుల వివరాలు అమ్మకం వివరాలు విపులంగా అడిగి తెలుసుకున్నారు. ప్రదర్శన దారులంతా కూడా తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ చాలా బాగా తమ ఉత్పత్తుల గురించి అందరికీ తెలిసిందని, వ్యాపారం జరిగిందని తెలియపరిచారు. ఈ సందర్భంగా కార్తీక్ వారికి సలహాలు ఇస్తూ బ్రాండింగ్ ప్యాకింగ్ మరియు మార్కెటింగ్ అంశాల్లో ఇంకా స్వయం సహాయక సంఘాలు, ఉత్పత్తిదారుల సంఘాలు జాయింట్లైబులిటీ గ్రూప్స్ అభివృద్ధి చెందాలని, మార్కెట్ పరంగా ఆన్లైన్ మార్కెటింగ్ ను కూడా అలవర్చుకోవాలని వారికి



సలహాలు సూచనలను అందించారు. ఈ సందర్భంగా ఈ మేళా ఏర్పాటు చేసినటువంటి నాబార్డ్ వారిని జాయింట్ కలెక్టర్ ప్రశంసిస్తూ నాబార్డ్ ఆధ్వర్యంలో ఇంత మంచి మేళా ఏర్పాటు చేయటం చాలా ఆనందదాయకమని, పాల్గొన్నటువంటి ప్రదర్శకులు అందరికీ కూడా ఉచిత వసతి భోజన కల్పించి మూడు రోజుల పాలు పాటు తమ ఉత్పత్తులను కొట్టడానికి అవకాశం కల్పించిందని



చెప్పారు. అదేవిధంగా ఈ సందర్భంగా ప్రదర్శనలో పాల్గొన్నటువంటి ప్రతి నిర్వాహకులకి సర్టిఫికేట్ ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈ మేళాను నిర్వహించినటువంటి నాబార్డు సంస్థ జిల్లా అభివృద్ధి అధికారి శ్రీ కార్తీక్, అవార్డు సంస్థ సీఈవో శ్రీ రమణయ్య ఇంకా పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు నంద్యాల ప్రజలు పాల్గొన్నారు.

# దేశ ప్రజలకు ఆధునిక వైద్యం అందించడమే లక్ష్యం.

**ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా మార్చి 18:**కేంద్ర ప్రభుత్వం ద్వారా భారతదేశ ప్రజలకు ఆధునిక వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్ డి ఏ ప్రభుత్వం పనిచేస్తుందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, పార్లమెంట్ హెల్త్ స్టాండింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం న్యూ ఢిల్లీలో నిర్వహించిన హెల్త్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూఈ సమావేశంలో దేశవ్యాప్తంగా ఆరోగ్య రంగ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే విధానాలపై విస్తృతంగా చర్చించడం జరిగిందని, ప్రజల ఆరోగ్య భద్రతకు సంబంధించిన ముఖ్యమైన అంశాలపై సుదీర్ఘంగా చర్చించి, పార్లమెంట్ హెల్త్ స్టాండింగ్ కమిటీ సభ్యుల అభిప్రాయాలు పంచుకోవడం జరిగిందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చెప్పారు.

# ‘ఉస్తాద్’కి హైలైట్ గా నిలిచే విలనిజం!

‘ఉస్తాద్ భగత్ సింగ్‘ .. మరికొన్ని గంటల్లో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతోంది. హరీశ్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాపై ఒక రేంజ్ లో అంచనాలు ఉన్నాయి. అడ్వాన్స్ బుకింగ్స్ దగ్గర నుంచి ప్రతి విషయంలోను ఈ సినిమా కొత్త రికార్డులను సృష్టించడం ఖాయమనే అభిప్రాయంతో అభిమానులు ఉన్నారు. శ్రీలీల – రాశీ ఖన్నా కథానాయికలుగా నటించిన ఈ సినిమాలో, ప్రతినాయకుడిగా పార్తీబన్ కనిపించనున్నాడు. కోలీవుడ్ సీనియర్ స్టార్ హీరోలు, కొంతకాలంగా తెలుగులో విలన్ రోల్స్ చేస్తూ వెళుతున్నారు. పవర్ఫుల్ విలన్ గా తెలుగు తెరపై కనిపించడానికి వాళ్లు ఎంతమాత్రం వెనకాడటం లేదు. ఆ జాబితాలో అర్జున్ .. అరవింద్ స్వామి .. విజయ్ సేతుపతి వంటి స్టార్స్ కనిపిస్తున్నారు. తాజాగా ఆ వరుసలోకి పార్తీబన్ చేరిపోయాడు. తమిళంలో సీనియర్ హీరోగా .. దర్శక నిర్మాతగా పార్తీబన్ కి మంచి ఇమేజ్ ఉన్న సంగతి తెలిసిందే. ఈ జనరేషన్ తెలుగు ఆడియన్స్ కి పార్తీబన్ అంతగా తెలియదు. ఎందుకంటే నేరుగా ఆయన తెలుగులో చేసిన సినిమాలు చాలా తక్కువ. తమిళ సినిమాల అనువాదాలు ద్వారానే ఆయన ఇక్కడి ఆడియన్స్ కి తెలుసు. అలాంటి పార్తీబన్ ఈ సినిమాలో పవర్ఫుల్ విలన్ పాత్రలో కనిపించనున్నాడు. ఆయన పాత్రను హరీశ్ శంకర్ చాలా డిఫరెంట్ గా డిజైన్ చేశాడట. ఈ పాత్ర ఈ సినిమా హైలైట్స్ లో ఒకటిగా నిలుస్తుందని అంటున్నారు. విలక్షణమైన విలనిజంతో పార్తీబన్ ఏ రేంజ్ లో మెప్పిస్తాడో చూడాలి మరి.





# హీరోల ఆలోచనా విధానంపై తాప్సీ విమర్శలు

బాలీవుడ్ ‘ఫైర్ బ్రాండ్‘ తాప్సీ పన్ను తాజాగా ఒక ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు సినీ పరిశ్రమలో మరోసారి ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా అగ్ర హీరోల అభద్రతా భావం గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి.తాప్సీ తన తాజా ఇంటర్వ్యూలో హీరోల ఆలోచనా విధానాన్ని ఎండగట్టింది. కథానాయికలకు ప్రాధాన్యత ఉన్న సినిమాల్లో నటించడానికి చాలా మంది స్టార్ హీరోలు సిద్ధంగా లేరని ఆమె విమర్శించింది. ఈ సందర్భంగా తనకు ఎదురైన ఒక చేదు అనుభవాన్ని తాప్సీ పంచుకుంది.“ఒక సినిమాలో నేను డబుల్ రోల్ చేస్తున్నప్పుడు, సదరు హీరో ఆ ప్రాజెక్ట్‌ను రిజెక్ట్ చేశాడు. దానికి ఆయన చెప్పిన కారణం ఏంటంటే.. సినిమాలో హీరోయిన్ పాత్రకు ఎక్కువ నిడివి, ప్రాధాన్యత ఉంటే చివరకు ప్రేక్షకుల సానుభూతి, ప్రశంసలు ఆమెకే దక్కుతాయని ఆయన భయపడ్డాడు. అంతకుముందే ఆ హీరోతో తాను కలిసి పనిచేసినప్పటికీ... కేవలం తన పాత్రకు ప్రాధాన్యత ఎక్కువగా ఉందనే అభద్రతా భావంతో ఆయన వెనక్కి తగ్గడం నన్ను ఆశ్చర్యపరిచింది“ అని తాప్సీ వెల్లడించింది.కేవలం సీనియర్ హీరోలే కాదు, ఇండస్ట్రీలోకి కొత్తగా వస్తున్న యువ హీరోలు కూడా హీరో పాత్ర నిడివి తక్కువగా ఉంటే అటువంటి సినిమాలకు దూరంగా ఉంటున్నారని ఆమె విమర్శించింది. హీరోయిన్ డామినేట్ చేస్తుందనే భయంతో మంచి కథలను వదులుకోవడం వల్ల చిత్ర పరిశ్రమలో సమానత్వం అనేది ప్రశ్నార్థకంగా మారుతోందని ఆమె అభిప్రాయపడింది. ప్రస్తుతం తాప్సీ వ్యాఖ్యలపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

# రాజకీయాల్లోకి రావడంపై క్లారిటీ ఇచ్చిన నారా రోహిత్


టాలీవుడ్ నటుడు నారా రోహిత్ తన రాజకీయ రంగప్రవేశంపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అటు సినీ, ఇటు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీశాయి. తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన భవిష్యత్ ప్రణాళికలపై స్పష్టతనిచ్చారు.ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడి కుమారుడిగా, లోకేశ్ కు సోదరుడిగా రాజకీయ నేపథ్యం ఉన్నప్పటికీ... రోహిత్ ఇప్పటి వరకు సినిమాలకే పరిమితమయ్యారు. తాజాగా ఆయన మాట్లాడుతూ, “కచ్చితంగా రాజకీయాల్లోకి వస్తాను. కానీ దానికి ఇంకా సమయం ఉంది. సరైన సమయంలో నా రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభిస్తాను“ అని తెలిపారు. ప్రస్తుతం తన పూర్తి దృష్టి సినిమాలపైనే ఉందని, వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరించడమే తన మొదటి ప్రాధాన్యత అని వెల్లడించారు.



# ఆల్-టైమ్ రికార్డులపై కన్నేసిన ‘ధురంధర్ 2’

రణ్‌వీర్ సింగ్ హీరోగా, ఆదిత్య ధర్ దర్శకత్వంలో రాబోతున్న ‘ధురంధర్ 2’ చిత్రం విడుదలకు ముందే బాక్సాఫీస్ వద్ద సరికొత్త సంచలనాలు సృష్టిస్తోంది. ఈ సినిమాపై ప్రేక్షకుల్లో కనిపిస్తున్న అసాధారణమైన క్రేజ్, అడ్వాన్స్ బుకింగ్స్ రూపంలో రికార్డులు సృష్టిస్తోంది. ఈ ప్రభంజనం ఎంతలా ఉందంటే, ముంబైలోని ఐకానిక్ థియేటర్ మరాఠా మందిర్‌లో దశాబ్దాలుగా ప్రదర్శితమవుతున్న షారుఖ్ ఖాన్ ‘దిల్‌వాలే దుల్హనియా లేజాయేంగే‘ (డీడీఎల్‌జే) షో సమయాన్ని కూడా మార్చాల్సి వచ్చింది.‘ధురంధర్ 2’ నిడివి దాదాపు 3 గంటల 55 నిమిషాలు ఉండటంతో థియేటర్లు షోలను సర్దుబాటు చేయడంలో తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఇందులో భాగంగా ఇవాళ్టి నుంచి మరాఠా మందిర్‌లో డీడీఎల్‌జే ప్రదర్శనను ఉదయం 10 గంటలకు మార్చారు. గత మూడు దశాబ్దాలుగా ప్రతిరోజూ ఉదయం 11:30 గంటలకు ప్రదర్శించబడుతూ వస్తోంది. దశాబ్దాల చరిత్రలో డీడీఎల్‌జే షో సమయం ఇలా మారడం ఇదే తొలిసారి. ఈ థియేటర్‌లో ‘ధురంధర్ 2’ ను మధ్యాహ్నం 1:15, సాయంత్రం 5:30, రాత్రి 9:45 గంటలకు ప్రదర్శించనున్నారు. దేశవ్యాప్తంగా పలు థియేటర్లు అర్ధరాత్రి, తెల్లవారుజామున కూడా ప్రత్యేక షోలను ప్లాన్ చేస్తున్నాయి. గతంలో ‘పుష్ప 2‘, ‘యానిమల్‘ వంటి భారీ చిత్రాలకు ఇలాంటి మార్పులు జరిగినప్పటికీ, ఒక హిందీ సినిమాకు అడ్వాన్స్ బుకింగ్స్ దశలోనే ఈ స్థాయిలో ఏర్పాట్లు జరగడం ఇదే మొదటిసారి.ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆల్-టైమ్ రికార్డులపై కన్నేసింది. అడ్వాన్స్ బుకింగ్స్ సరళిని గమనిస్తే, తొలిరోజు వసూళ్లలో షారుఖ్ ఖాన్ ‘జవాన్‘ రికార్డును ‘ధూరందర్ 2‘ అధిగమించేలా కనిపిస్తోంది. ‘జవాన్‘ తొలిరోజు హిందీలో రూ. 65.50 కోట్లు, దేశవ్యాప్తంగా రూ. 75 కోట్లు వసూలు చేసింది. ఇప్పటికే ‘ధురంధర్ 2’ అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారా రూ. 30.31 కోట్లు రాబట్టింది. ‘జవాన్‘ రికార్డును అందుకోవాలంటే మరో రూ. 35 కోట్ల వరకు అవసరం.అయితే, హిందీ చిత్ర పరిశ్రమలో ఆల్-టైమ్ హైయెస్ట్ ఓపెనర్ రికార్డు ప్రస్తుతం అల్లు అర్జున్ ‘పుష్ప 2‘ పేరిట ఉంది. ఈ చిత్రం తొలిరోజు హిందీలో రూ. 72 కోట్లు, పాన్-ఇండియా స్థాయిలో రూ. 164.25 కోట్లు వసూలు చేసింది. ఇప్పుడు ‘ధురంధర్ 2’ ఈ భారీ రికార్డును సవాలు చేస్తుందో లేదోనని సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. మొత్తానికి విడుదలకు ముందే ‘ధురంధర్ 2’ బాక్సాఫీస్ వద్ద పెను తుపానుకు సంకేతాలు పంపుతోంది.




# ‘పెద్ది‘ సెట్స్‌లో క్రికెటర్ తిలక్ వర్మ..

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, సంచలన దర్శకుడు బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం ‘పెద్ది‘. గ్రామీణ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా సెట్స్‌లో తాజాగా టీమిండియా యువ క్రికెటర్ తిలక్ వర్మ సందడి చేశాడు. ఈ అనూహ్య పరిణామం చిత్ర యూనిట్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.ఈ విషయాన్ని దర్శకుడు బుచ్చిబాబు సానా స్వయంగా తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు. రామ్ చరణ్, తిలక్ వర్మ కలుసుకున్న వీడియోను పంచుకుంటూ... “టీ20 ప్రపంచకప్ ఛాంపియన్ తిలక్ వర్మ ‘పెద్ది‘ సెట్స్‌ను సందర్శించారు. సినిమాలోని కొన్ని క్రీడా నేపథ్య సన్నివేశాలను చూసి ఆయన చాలా ఇంప్రెస్ అయ్యారు“ అని పేర్కొన్నారు. ఈ పోస్ట్‌తో పాటు సినిమాను ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మరోసారి ధ్రువీకరించారు.సెట్స్‌లో జరిగిన ఈ భేటీలో తిలక్ వర్మ సినిమాలోని కొన్ని కీలక స్పోర్ట్స్ సీక్వెన్స్ ఫుటేజ్‌ను వీక్షించినట్లు సమాచారం. కేవలం యాక్షన్ మాత్రమే కాకుండా ఆ సన్నివేశాల్లోని భావోద్వేగాలను చూసి ఆయన చాలా బాగున్నాయని ప్రశంసించినట్లు చిత్రవర్గాలు తెలిపాయి. తిలక్ వర్మ లాంటి ఒక ప్రొఫెషనల్ క్రీడాకారుడి నుంచి వచ్చిన ఈ ప్రశంస, తాము తీస్తున్న సన్నివేశాలు ఎంతో వాస్తవికంగా, ఉద్వేగభరితంగా ఉన్నాయనే నమ్మకాన్ని చిత్ర బృందంలో మరింత పెంచిందని తెలుస్తోంది.


ఈ సందర్భంగా రామ్ చరణ్, తిలక్ వర్మను ప్రత్యేకంగా అభినందించి, తన ఆటోగ్రాఫ్‌తో కూడిన ‘పెద్ది‘ సినిమా బ్యాట్‌ను




బహుమతిగా అందించారు. అనంతరం తిలక్ వర్మ చిత్ర యూనిట్‌ను ఉద్దేశించి తెలుగులో మాట్లాడటం అందరినీ ఆకట్టుకుంది. ప్రస్తుతం ఈ సినిమా చివరి షెడ్యూల్ చిత్రీకరణతో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆర్. రత్నవేలు సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్, అవినాశ్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ వంటి స్పిట్జెన్ సాంకేతిక నిపుణుల పనితనం సినిమా స్థాయిని పెంచుతోంది.

# ‘ఉస్తాద్‘ ఉప్పెనలా పాత రికార్డులు తుడిచేస్తాడంటున్న ఫ్యాన్స్!

పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ అంతా ఇప్పుడు ‘ఉస్తాద్ భగత్ సింగ్‘ సినిమా కోసం వేయికళ్లతో వెయిట్ చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ వారు భారీ బడ్జెట్ తో నిర్మించిన ఈ సినిమా, టైటిల్ దగ్గర నుంచే అంచనాలను పెంచడం మొదలుపెట్టింది. ఇక పోస్టర్స్ దగ్గర నుంచే అందరిలోను ఆసక్తిని పెంచుతూ వెళ్లింది. పవన్ కల్యాణ్ కి ఉన్న మాస్ ఇమేజ్ కీ .. ఆయన బాడీ లాంగ్వేజ్ కి సరిగ్గా సరిపోయే కంటెంట్ అనేది అభిమానులకు అర్థమైపోయింది. ఈ సినిమాకి దర్శకుడు హరీశ్ శంకర్ కావడం ఇక్కడ మరో విశేషం. హరీశ్ శంకర్ కి మాస్ ఆడియన్స్ పల్స్ తెలుసు. పవన్ సినిమా నుంచి ఫ్యాన్స్ ఏం కోరుకుంటున్నారనేది ఆయనకి తెలుసునని అనడానికి ‘గబ్బర్ సింగ్‘ సినిమాను ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు. దేవిశ్రీ బాణీలు .. తమన్ నేపథ్య సంగీతం ఈ సినిమాకి ప్రధానమైన ఆకర్షణగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ జోరు చూస్తేనే, ఏ స్థాయిలో ఆడియన్స్ ఉత్సాహాన్ని చూపిస్తున్నారనేది అర్థమైపోతుంది. పవన్ కల్యాణ్ జోడీగా శ్రీలీల తొలిసారిగా చేసిన సినిమా ఇది. నటన పరంగా .. డాన్స్ పరంగా శ్రీలీలకి వంక బెట్టడానికి లేదు. అయితే ఆమెకి సరైన హిట్ లేక చాలా కాలమే అవుతోంది. ఈ నేపథ్యంలో ఈ సినిమాపై ఆమె గట్టిగానే ఆశలు పెట్టుకుంది. ఇక రాశీ ఖన్నా కెరియర్ గ్రాఫ్ చాలా స్లో అయిన తరువాత ఆమెకి దక్కిన గొప్ప అవకాశం ఇది. హరీశ్ శంకర్ కి కూడా ఈ సినిమా హిట్ చాలా కీలకం కానుంది. ‘ఉస్తాద్‘ ఉ ప్పెనలా పాత రికార్డులు తుడిచేయడం ఖాయమనే అభిమానుల అంచనాలను ఈ సినిమా నిజం చేస్తుందేమో చూడాలి.




శ్రీ చౌడేశ్వరి దేవి దేవస్థానము
నందవరం గ్రామం, నంద్యాల జిల్లా
స్వస్తిశ్రీ పరాభవనామ సంవత్సర చైత్ర శుద్ధపాడ్యమి
19-3-2026 గురువరం నుండి
25-3-2026 బుధవరం వరకు
రాయబారాది, జ్యోతి,
రథ, వసంతోత్సవములు
అంగరంగ వైభవంగా జరుగును.
కావున భక్తాదులు విరివిరిగా పాల్గొని
అమ్మ వారి కృపాకటాక్షలు పొంది
జయప్రధం చేయవలసినదిగా
కోరుచున్నాము.
గమనిక : దేవస్థానం అభివృద్ధి కొరకు
భక్తులు, దాతలు తమ వంతుగా విరాళాలు,
కనుకలు అందిచవలసినదిగా కోరుతున్నాము.
ఉగాది
శుభాకాంక్షలు
శ్రీ ఎన్. శ్రీనివాస రెడ్డి
అసిస్టెంట్ కమీషనర్
కార్యనిర్వాహక అధికారి
శ్రీ పి.వి. నాగార్జున్ రెడ్డి, చైర్మన్
శ్రీచౌడేశ్వరిదేవి దేవస్థానం
నందవరం గ్రామం, నంద్యాల జిల్లా.